# మారిన జీవితం

**కొడవటిగంటి కుటుంబరావు**

బుద్ధి తెలిశాక దత్తుపోయే కుర్రాళ్ళ సంగతి తలుచుకుంటే నాకొకప్పుడు ఒళ్ళు గగుర్పొడిచేది. వాళ్ళు ఆస్తికోసం ఒక అమ్మనూ, అయ్యనూ వొదిలేసి, తాము పుట్టి పెరిగిన ఇంటినీ, వాతావరణాన్నీ వొదిలేసి, ఇంకో ఇంటికి పోయి, ఇంకో పరాయి ఆవిణ్ణి అమ్మా అనీ, పరాయి ఆయన్ని నాన్నా అనీ పిలవాలి. సొంత అన్నదమ్ములూ, అక్కచెల్లెళ్ళూ ఎవరో అన్నట్టుగా నటించాలి. దత్తుపోయిన వాళ్ళు ఈ పనులన్నీ నేనూహించిన దానికన్న సులువుగానే నేర్చుకుంటారేమో నాకైతే తెలీదు. కాని నా ఉద్దేశంలో వాళ్ళు పడే వేదనకన్న వాళ్ళను చూసి సానుభూతిపరులు పడే వేదనే సాంఘిక ప్రయోజనం గలది. మనుషులకు ఎంత సహనశక్తి ఉంటుందో ఎవరూ కనిపెట్టలేదు. కొంచెం సంస్కారం గలవాళ్ళు దుర్భరంగా తలపోసే పరిస్థితులలో కోట్లాది మానవులు జీవిస్తున్నారు. సహనం అవసరమైనకొద్దీ మనసు మొద్దుబారుతుంది. మరీ దుర్భరమైన శరీర బాధ కలిగినప్పుడు మనసు మూర్ఛపోవటం మనకు తెలిసిన విషయమే. అనేకమంది పాక్షిక మానసిక మూర్ఛలు జీవితాలను వెళ్ళబుచ్చి, చివరకు ఏకంగా కన్నుమూస్తారు. ఈ మూర్ఛలో వున్నవాళ్ళు సంస్కారాన్ని పెంచలేరు, సాంఘిక పరిణామాన్ని సాధించనూ లేరు. లక్షమంది బాలవితంతువులు చెయ్యలేని సంస్కారాన్ని ఒక్క వీరేశలింగంపంతులుగారు చేశారంటే– ఆయన పడిన వేదన వారందరికన్న ఎక్కువైనది గనకనే.

దత్తుపోయినవాళ్ళు అందరికీ అణిగిమణిగి ఉండటం నేను గమనించాను. ఇల్లరికం వచ్చిన అల్లుళ్ళు కూడా అంత అణకువగా ఉండరు. దత్తపుత్రులు మొట్టమొదట నేర్చుకునే విద్య తమ సహజ భావాలను గోప్యంగా ఉంచుకోవడం — తమ ప్రేమలనూ, ద్వేషాలనూ, బాధలనూ, ఒక్కొక్కప్పుడు సంతోషాన్ని కూడా అణచిపెట్టుకోవడం. వాళ్ళను చూస్తున్నప్పుడు నాకింకేదో స్ఫురణకువస్తున్నట్టుండేది. కాని అదేదో తెలుసుకోవటానికి నాకు దాదాపు పదేళ్ళు పట్టింది. దత్తపుత్రులను చూస్తే నాకు జ్ఞాపకం రావటానికి ప్రయత్నించినది — కాపరానికి వచ్చే ఆడవాళ్ళు.

ఎక్కడో ఒకదత్తు పోయినవాడికి కలిగే అనుభవం దాదాపు ప్రతి ఆడ

## పెద్ద కథ

దానికి కలుగుతుంది. వీళ్ళిద్దరికీ తేడా ఏమంటే, కాపరానికి వెళ్ళగలందులకు ఆడపిల్ల తండ్రి ఇల్లు గుల్లచేస్తుంది, దత్తుడు తన జనక స్థానంలోలేని ఐశ్వర్యం కోసం వస్తాడు. వాడిపనే చాలా మెరుగు.

నేను గ్రహించిన ఈ విషయాలు మా ప్రకాశానికి పనికొస్తాయని ఎంతో ఆశించాను — కాని నా ప్రయత్నం వృధా అయింది. అది ఫలిస్తుం దనుకుని ఉండటం నా పొరపాటే. జీవితాన్ని గురించి లక్ష సత్యాలు తెలుసుకుని ఏం ప్రయోజనం, ఒక్క చిన్న సత్యానికి అనుగుణంగా జీవితాన్ని మార్చే శక్తి లేనప్పుడు? సంస్కారం విప్లవాత్మక మైనది, ఉత్త జ్ఞానం చాలదు. వీరేశలింగం పంతులుగారు తానై ఒక్క వితంతువునూ పెళ్ళాడలేదు, యువకులలో ఒక విప్లవ చైతన్యాన్ని తెచ్చిపెట్టాడు.

చిత్రమేమిటంటే మా ప్రకాశం మంచి సంస్కార భావాలు కలవాడు. వాడికి పాత కాలపు మకిలి భావాలు ఏ మాత్రమూ గిట్టవు. కుసంస్కారాన్ని సహించలేక వాడు కొందరు దగ్గర బంధువులను సైతం వదులుకున్నాడు. కులం విడిచి పెట్టాడు. "ప్రకృతి ఏ ఇద్దరు మనుషులనూ ఒక రకంగా పుట్టించటం లేదు. ఆ తేడాలు చాలనట్టు సంఘం మరికొన్ని తేడాలు కృత్రిమంగా కలిగించి, ఒకరికన్న మరొకరు తక్కువ జన్మ ఎత్తారనటం దారుణం. ప్రకృతి కలిగించే తేడాలను సంఘం సరిచెయ్యాలి. బలవంతులు దుర్బలులకు తోడ్పడాలి. పిల్లలను పెద్దలు సంరక్షించాలి. పడినవాణ్ణి నిలబడ్డ వాడు ఎత్తాలి. అంతేకాని ఒక్క సంఘంలో కొందరు హీనంగా పుట్టినవాళ్ళా? కొందరు అంటరానివాళ్ళా? అటర్లీ స్టుపిడ్! స్టుపిడ్ కూడాకాదు. హంబగ్. ఆ అంటరాని వాడే ఆఫీసరైతే బ్రహ్మరథం పట్టేస్తారు!" అనేవాడు ప్రకాశం.

ప్రకాశానికి ముగ్గురు మగపిల్లల మధ్య ఒక్కతే ఆడపిల్ల — లీల. దాన్నినేను పుట్టిన నాటినుంచీ ఎరుగుదును. అంత చలాకీగా ఉండేది కాదుగాని, మంచి ఆలోచనా శక్తి గలది. చాలా మితంగా మాట్లాడేది. కాని మాట్లాడినప్పుడు ఎంతో ఆలోచించి మాట్లాడినట్టుగా ఉండేది. ప్రకాశం కాస్త ఉద్రేకమైన మనిషి. లీల సాధారణంగా తొణికేదికాదు. తల్లి మోస్తరు. అయితే ఆవిడ అంత తెలివిగల దానికింద జమ కాదు.

అందుకే ప్రకాశం తన భార్యతో అడుగడుగునా పోట్లాడుతూ లీలను ఒక రకంగా పెంచుకొచ్చాడు. వాడి ఉద్దేశం ఆడపిల్లలను మగపిల్లల్లాగే పెంచాలని, వాడి భార్య ఉద్దేశం ఆడపిల్లలు మగపిల్లల్లే పెరగరాదని; "నేను ఆడ



దాన్ని, కష్టాలు పడవలిసినదాన్ని, చాకిరీ చెయ్యవలిసినదాన్ని, నలుగురూ నాలుగు మాటలూ అంటే పడి ఉండవలిసినదాన్ని"— ఈ ధోరణిలో ఆలోచించటం తనకూతురు చిన్నతనంనుంచే నేర్చుకోవాలని ఆవిడ ఉద్దేశం. అటువంటి మాటలు వింటేనే ప్రకాశానికి కంపరమెత్తేది.

"నాకున్నదే ఒక్కకూతురు. దాన్ని నా కంఠంలో ఊపిరి ఉండగా, బానిసత్వానికి తయారు కానివ్వను." అనేవాడు ప్రకాశం.

"కానివ్వక ఏం చేద్దామని మీ ఉద్దేశం?" అనేది భార్య.

"అది చదువుకుంటుంది. ఉద్యోగం సంపాదించుకుంటుంది. దాని కాళ్ళపైన అది నిలబడుతుంది. ఆర్థిక స్వాతంత్ర్యం! అది ఉంటే మిగిలిన స్వాతంత్ర్యాలన్నీ అవే వస్తాయి" అనేవాడు ప్రకాశం.

"అంటే దానికి పెళ్ళీ పెటాకులూ, సంసారమూ, ఇల్లూ వాకిలీ, ఏమీ వద్దా ?"

"నీ ముగ్గురు కొడుకులను గురించీ ఈ మాట ఏనాడైనా అడిగావా ?"

"వాళ్ళ దారి వేరూ. వాళ్ళు మగాళ్ళు ఎలాగైనా బతుకుతారు."

"అదీ అంతే. పెళ్ళి మగాడికన్న ఆడదాని కెక్కువ ముఖ్యమనే మాట నేను చచ్చినా ఒప్పుకోను."

ఈ విధంగా అడపా దడపా భార్యాభర్తలమధ్య వాగ్వాదాలు జరుగుతూండేవి. వాళ్ళు ఒకరి నొకరు అర్థం చేసుకునే అవకాశం లేదు. ఆవిడ ఉన్న సమాజాన్ని మనస్సులో వుంచుకుని మాట్లాడేది. వాడేమో తన కూతురి కొక ఉజ్వల భవిష్యత్తు ఊహించుకుని, దాన్ని చూస్తూ మాట్లాడేవాడు.

ప్రకాశందీ రోడ్డు రోలరు మనస్తత్వం కావటంచేతా, వాడి భార్య మెతక స్వభావంగల మనిషి కావటం చేతా, లీల తండ్రికి కావలసినట్టే పెరిగింది. దానికి చదువులో నూటికి యాభై పైగా మార్కులు వచ్చేవి. క్లాసులో మరీ గొప్పగా రాణించేదీ కాదు, బొత్తిగా సామాన్యంగానూ ఉండేది కాదు. క్లాసు పుస్తకాలకన్న ఇతర పుస్తకాలు తెగ చదివేది.

ప్రకాశం దీక్ష పట్టినవాడి మచ్చు. తన పిల్లలకు సంగీతమూ, సాహిత్యమూ, చిత్రలేఖనమూ, సినిమాలూ, అన్నీ అందుబాటులో ఉంచేవాడు. ఎవరికి ఎందులో అభిరుచి కలుగుతుందో, ఎందులో రాణిస్తారో చెప్పలేమని వాడి వాదం. గాలి పాటతో సినిమా గాయకులైన వాళ్ళనూ, సొంతాన ఆర్టు నేర్చుకున్న వాళ్ళనూ వుదాహరణలుగా చెప్పేవాడు.

లీల తన ఎనిమిదో ఏట డాన్సులో ఆసక్తి కనబరచింది. ప్రకాశం డాన్సు మేస్టరును పెట్టాడు. దాదాపు ఒక సంవత్సరంపాటు కర్రల చప్పుళ్ళతో వాళ్ళిల్లు అదిరిపోయింది.

"ఎందుకండీ ఈ దిక్కుమాలిన డాన్సు ?" అని ప్రకాశం భార్య అభ్యంతరం చెప్పింది. అది కూడా గుడ్డా పెట్టదనీ, పెళ్ళయాక డాన్సు చేస్తానంటే అత్తవారు దానికాళ్ళు విరగ్గొడతారనీ ఆవిడ ఆందోళన. ఆవిడ దివ్యదృష్టికి కనిపించిన లీల భవిష్యత్తులో "తకధిం"కు ఎక్కడా చోటు లేదు. ప్రకాశం లీల భవిష్యత్తును దుర్భిణివేసి చూడలేదన్న మాటేగాని, లీల లకినంబరు డాన్సులోనే ఉండే పక్షంలో ఆ డాన్సు ఎందుకు పాడు చెయ్యాలని !

ఒక సంవత్సరం గెంతాక లీలకు డాన్సులో ఆసక్తి తగ్గిపోయి సంగీతం మీద బుద్ధి మళ్ళింది. డాన్సు మేస్టరు నిష్క్రమించి సంగీతం మేస్టరు రంగంమీదికి వచ్చింది. గాత్ర పాట సారీగామాలతో ప్రారంభమై మెల్లిగా ముందుకు సాగింది. లీల గొంతు అంత శ్రావ్యమూ కాదు, బొత్తిగా గార్దభస్వరమూ కాదు. అది పాట నేర్చుకుంటున్న రోజుల్లో ఒక్కటి

మాత్రం నేను చెప్పగలిగాను. అది పాడటానికి పుట్టిన మనిషి మట్టుకు కాదు. అటువంటప్పుడు దాని సంగీత శక్తి నూటికి తొంభై పాళ్ళు అది చేసే సాధనపైన — తపస్సుపైన—ఆధార పడుతుంది.

నిజానికి లీల అటువంటి తపస్సేమీ చెయ్యలేదు. సంగీతమంటే దాని దృష్టిలో సినిమా పాటలు. సంగీతం మేష్టరు వాటిని నేర్పలేదు. ఆయన నేర్పే సంగీతం లీలకు కొంచెం కూడా బాగాలేదు. ఒక మంచి రోజు చూసి సంగీతం మేష్టరు సెలవు పుచ్చుకున్నాడు.

ఆ తరవాత కొద్ది రోజులకు నేను ప్రకాశం వాళ్ళింటికి వెళ్ళేసరికి లీల తల ఒక పక్కకి పెట్టి ఏదో బొమ్మ గీస్తున్నది. ఏదో సహాయం చెయ్యమని తల్లి వంటింట్లో నుంచి పిలుస్తుంటే అది విసుగ్గా, "అయిపో వచ్చింది, కొంచెం వుండమ్మా!" అంటున్నది.

తరవాత ప్రకాశం చెప్పాడు. లీలకు ఆర్టుమీద ఎక్కడలేని ఆసక్తి పుట్టుకొస్తున్నదట. "వ్యవసాయాత్మికాబుద్ధి రేవేహకురునందన" అన్నాడు గీతలో. లీలకు ఎందులోనూ ప్రవేశం కలగదని నా కెందుకో అనుమానం కలిగింది.

ఆ మాటే నేను ప్రకాశంతో లౌక్యంగా అన్నాను. "లీలకు ఎందులో గాని నిజంగా చొరవ ఉన్నట్టు రూఢి అయేదాకా నువు మాత్రం ప్రోత్సాహం ఇవ్వకు. దాని మనసు దానికే సరిగా తెలిసినట్టు లేదు." అన్నాను.

లీలకు కోరిన అవకాశాలు మాత్రమే ఇస్తున్నాను గాని ప్రోత్సాహం ఇవ్వటం లేదని ప్రకాశం అన్నాడు. అసలు వచ్చిన చిక్కేమిటో నాకు తరవాతగాని అర్థం కాలేదు. డాన్సు నేర్చుకుంటున్నప్పుడు గాని, సంగీతం నేర్చుకుంటున్నప్పుడు గాని, చివరకు బొమ్మలు వేస్తున్నప్పుడు గాని లీల నేర్చుకుంటున్నవిద్యలో ఆసక్తి కనబరిచి, తగిన వాతావరణం సృష్టించినవారు లేరు. మేస్టర్లను పెట్టగానే తన డ్యూటీ తీరిపోయినట్టు ప్రకాశం ప్రవర్తించాడు. తల్లి, "మేష్టరున్నంతసేపే నేమిటే, నీ అంతట నువు సాధన చేసుకోవేం?" అని పోరేది. సాధన అనగానే లీలకు అదొకశిక్ష అనే భావం ఏర్పడిపోయి నేర్చుకునే విద్యమీదనే విముఖత్వం పుట్టుకురాసాగింది. పదిమందితో బాటు నేర్చుకున్నట్టయితే దానికి డాన్సు, సంగీతమూ కూడా వచ్చి ఉండేవేమో మరి. కనీసం లీల అన్నలూ,తమ్ముడూ ఆసక్తి కనబరిచినా ఏమై ఉండేదో. వాళ్ళు లీల విద్యలపట్ల విసుగుతప్ప మరే భావమూ కనబరచలేదు - ఎప్పుడైనా మంచి మూడ్‌లో ఉన్నప్పుడు వేళాకోళం తప్ప. ("ఇవాళ లీలచేసిన డాన్సుకు నాలుగు పళ్ళవొడ్లు బియ్యమై ఉండేవి!" ఇత్యాది.)

లీలకు మిగిలిన వేవీ అంటక పోయినా చదువు మాత్రం అవిచ్ఛిన్నంగా సాగింది. అయితే దాని మార్కు 'బి' నుంచి 'సి క్లాస్'కు దిగ

జారింది. కారణం సినిమాలూ, కథల పత్రికలూనూ. అది ప్రకాశంతోకన్న నా తోనే మనసు విప్పి మాట్లాడే దనుకుంటాను. ప్రకాశం అసి ధారా వ్రతంగాడు, చెప్పినది విని ఊరుకోడు, దానిమీద వ్యాఖ్యానిస్తాడు. లీల బియ్యేలో చేరిన ఏడు దాని మాటలను బట్టి నేను గ్రహించిన దేమంటే: దానికి పెళ్ళంటే అసహ్యం; ప్రేమ కధలు ఇష్టం; ఆడవాళ్ళ కష్టాల కధలు కల్పించి రాసినట్టుంటాయి; జీవితం సినిమాల్లో చూపించి నట్టుంటే బాగానే వుంటుంది; ఎవరింటికి వెళ్ళినా, ఎప్పుడింటికి తిరిగి వద్దామా అనిపిస్తుంది. ఇలాటివే మరికొన్ని ఉన్నాయి.

దాని ధోరణి అర్థం చేసుకుంటున్న కొద్దీ నాకు కాస్త భయం వేసినమాట నిజం. లీల వాస్తవజీవితానికి దూరమవుతున్నది. తన జీవితానికి పెళ్ళి సమస్య ఉండదనీ, ప్రేమ సమస్యే ఉంటుందనీ అనుకుంటున్నది. అంతకన్నా దారుణ మేమంటే అది తమ ఇంటి జీవితానికి బాగా పెనవేసుకు పోతున్నది. రేపు మరొక వాతావరణంలోకి అడుగు పెడితే దాని గతి ఏం కాను? ప్రకాశం ఈ విషయం ఆలోచించినట్టు కనబడ లేదు.

నేను పని పెట్టుకుని ఒకసారి వాళ్ళింట్లో ఈ ప్రసంగం తెచ్చాను.

"మన చిన్నతనంలో బాల్య వివాహాలు జరిగిన రోజుల్లో ఆడపిల్లల పెంపకంలో ఒక సుగుణం ఉండేది," అన్నాను.

"చెత్త జీవితం. అందులో సుగుణాలెంచకు," అన్నాడు ప్రకాశం చీదరించుకుంటూ.

"విను, చిన్నతనం నుంచీ ఆడపిల్ల అని రోసేవాళ్ళు. లేతవయసులోనే ఇంటిపని నేర్పేవాళ్ళు. ఇంటిపని మీద తప్ప ఇతర వ్యాపకాల మీద ఆడపిల్ల ఆసక్తి కనబరిస్తే తిట్టి శాపనార్థాలు పెట్టేవాళ్ళు. ఆఖరుకు పుస్తకం పట్టుకు కూర్చున్నా, పనీపాటా లేదా ఏమని కోప్పడేవాళ్ళు. తనను వదిలించుకోవటానికి తల్లిదండ్రులు పడేపాట్లు ఆడపిల్ల కళ్ళారా చూసేది, నాలుగు సంబంధాలు తిరిగిపోతే తనను వాళ్ళుపెట్టే శాపనార్థాలు చెవులారా వినేది. ఆ రోజుల్లో ఆడపిల్లకు పుట్టింటిపైన అసహ్యం చిన్నచిన్న దోసుల్లో పెళ్ళయేదాకా వంట బట్టేది. అట్లాపెరిగిన పిల్ల కాపరానికి వెళ్ళకముందే అత్తమామల భయాలూ, ఆడబిడ్డలభయాలూ వగైరాలు నేర్చుకునేది. అందుచేత ఆడపిల్లకు కాపరం వెళ్ళటమంటే ఏ బియ్యే పరిక్షో ప్యాసవటమనిపించేది. ఒక గొప్ప విజయం లాగుండేది." అన్నాను.

"ఛీ, ఛీ, కుక్క బతుకు!" అన్నాడు ప్రకాశం.

వాడి భార్య నవ్వుతూ, "అన్నగారిదంతా మరీ విడ్డూరం," అన్నది నా విడ్డూరంలో కొంతనిజం ఉందని గ్రహించినట్టు.

"కుక్క బతుకు కాదనటంలేదు. వాస్తవిక దృష్టిగల పెంపకమనే అంటున్నాను" అన్నాను.

"ఆ వాస్తవాన్ని రబ్బరుతో చెరి పెయ్యి, చించి అవతల పారెయ్యి, కిరసనాయిలు పోసి అంటించు" అన్నాడు ప్రకాశం ఆవేశంతో.

"నా వల్ల అయితే ఎప్పుడో చెయ్యక పోయానుట్రా? వెయ్యిమంది ఆడవాళ్ళలో ఒకతె కూడా జీవితంలో పెద్ద మార్పేమీ లేదు. కుర్రాళ్ళకు కథల్లో ప్రేమ కావాలి. జీవితంలో కట్నం కావాలి. చదువుకున్న ఆడది పెళ్ళాంగా పనికిరాదు. పెళ్ళానికి ఏకళలో ప్రవేశం వున్నా మొగుడు దాన్ని కట్టి పెట్టిస్తాడు. కట్టి పెట్టేదాకా కురుపు సలిపినట్టు సలుపుతాడు. సంస్కారంగల మొగుళ్ళే అలా ఛేశారు."

ప్రకాశం ఆలోచించటానికి ఒక్క క్షణం ప్రయత్నించి, "అందుకని?— ఛీ, ఛీ!" అని తేల్చేశాడు.

"మన పిల్లలు న్యూయార్కుకూ, మాస్కోకూ కాపరం వెళ్ళరు. వాళ్ళు తెల్లవాళ్ళను పెళ్ళాడరు. వాళ్ళకీ అత్తగార్లూ, ఆడబడుచులూ, బావగార్లూ, అడుగడుగునా అనుమానించే మొగుళ్ళూ, ఇరుగు పొరుగు అమ్మలక్కలూ ఉంటారు. పాత ఆచారాలేవీ మారలేదు. అందరిళ్ళలోనూ మీ యింటి పద్ధతు లున్నాయను కుంటున్నావా?"

"నీ ధోరణి నా కర్థం కావటం లేదు. అందుచేత ఆడవాళ్ళ జీవితం మారకూడ దంటావా?"

"ఆ మాట నే నెందు కంటానూ? ఉన్న సంగతి చెప్పాను. ఉండవలిసింది కాదు. మంత్రాలకు చింతకాయలు రాల్తే ఇంక లేందేం?" అన్నాను.

"బోలెడంతమంది ఆడపిల్లలు పెళ్ళయి కొత్త పద్ధతిలో జీవిస్తున్నారు."

"ఇది అచ్చంగా ఆడపిల్లలకు మాత్రమే సంబంధించిన సమస్యకాదు. నీ విషయమే తీసుకో. నువు చదివిన చదువుకు మీమస్తాను పాలెంలో ఉద్యోగం దొరకదు గనక నేగద ఈపట్నంలో వచ్చిపడ్డావు? ఆడపిల్లకైనా అంతే. వాళ్ళు ఏ రకంగా పెరుగుతారో దానికి తగ్గట్టు పెళ్ళాడాలి. కాపరం చెయ్యాలి. ఉద్యోగాలకన్న పెళ్ళిళ్ళు చాలాకష్టం."

ప్రకాశం పెద్దపెట్టుననవ్వి, "ప్రపంచం చాలా విశాలమైనదిరా!" అన్నాడు.

ఏ సంస్కారి కూడా తాను ఒంటరిగాణ్ణని అనుకోలేడు. తనలాటి వాళ్ల వేల సంఖ్యలోనూ, లక్షల సంఖ్యలోనూ ఉన్నారని ఊహించుకుంటాడు.

---

"పెళ్ళయిన కొత్తలో నాతో చక్కగా గంటలకొద్దీ కబుర్లు చెప్పేవారు. ఇప్పుడు మాట్లాట్టమే మానేశారు. నా మీద ప్రేమ వుండేగా?"

"ప్రేమ లేదూ? లేకపోవట మేమిటి, బోలెడుంది. ఇహ నోరు మూసుకుని పడుకో."

అందరి కూతుళ్ళకూ జరిగినట్టుగా తన కూతురికి జరగదని ప్రకాశం రూఢిగా నమ్మాడు.

## 2

లీల బియ్యే ఫైనలియర్ పరీక్ష తన్నేసింది. కారణం ఇదీ అని స్పష్టంగా తెలియలేదు. ఊహించాలంటే చాలా కారణాలు కనపడ్డాయి .... అప్పటికి రెండేళ్ళుగా అడ్డమైనవాళ్ళూ, అమ్మాయికి సంబంధాలు చూస్తున్నారా, పెళ్ళెప్పుడు, ఇంకా ఎన్నాళ్ళుంచుతారు. ఇటువంటి ప్రశ్నలు శరపరంపరగా అడగసాగారు. అప్పుడే ఏంతొందర లెమ్మంటే వాళ్ళు అవుననకపోగా, అంతులేని ఆశ్చర్యం ప్రకటించి. "ఇలాగే తాత్సారం చేసి అసలు పెళ్ళే కాకుండా పోయిన" నిదర్శనాలు చూపించారు. పైకి ఎంత గంభీర మొహం పెట్టినా లీలకు లోలోపల కొంత బితుకు ఏర్పడి వుండాలి. అది అంతకుమునుపు ఉంటున్న స్వాప్నిక జగత్తునుంచి బయటికి వచ్చి వాస్తవ జగత్తుయొక్క స్వరూపం గమనించనారంభించి ఉండవచ్చు..... దాని యీడు వాళ్ళూ, సహాధ్యాయినులూ ముగ్గురికప్పుడే పెళ్ళిళ్ళయి పోయాయి. వాళ్ళు పెళ్లిచేసుకుని సుఖపడుతున్నట్టే కనపడ్డారు .... ప్రకాశం పదిమంది నెరిగినవాడు, పలుకుబడి కలవాడు. కాని అతని పరిచయస్తులలో ఒక్క-

ప్రఖ్యాత ఔషధము

60 యేండ్లకు పైగా

జమ్మివారి లివర్‌క్యూర్

బిడ్డల యొక్క లివర్ మరియు స్ప్లీన్ వ్యాధులకు ప్రఖ్యాత ఔషధము

జమ్మి వెంకటరమణయ్య & సన్స్, మద్రాస్-4.

బ్రాంచీలు:

బెంగళూరు-2: కుంబకోణం:

తిరుచిరాపల్లి-2; హైదరాబాద్-20

JV/17/STE



రైనా, "నా కొడుక్కి నీ కూతురిని చేసుకోవాలని ఉంది." అన్న పాపాన పోలేదు. లీల అనాకారీ కాదు. రంభా కాదు. దానిలాటి పిల్లనే, దాని స్నేహితురాలిని, ఎవరో కోరి చేసుకున్నారు. కూతురి పెళ్ళి విషయం ఎవరు మాట్లాడినా ప్రకాశం మాట్లాడే మాటలు ప్రగల్భాలలాగా వినిపించేవి_వాడు, పాపం, ఉన్నమాట చెబుతున్నాననే అనుకునేవాడు. కాని పదిమంది ఆమోదించని సత్యాలు చెప్పేవాణ్ణి చూస్తే లోకానికి కొంచెం కసిగా ఉండే మాట నిజం. హరిశ్చంద్రుడు "నేను అబద్ధాలు కూడా ఆడుతాను మొర్రో" అన్నట్టుంటే ఆ కష్టాలేవీ వచ్చి ఉండకపోను. నిజం చెప్పటంలో కూడా ప్రగల్భం ఉంటుంది. నిభాయింపు లేనివాడు నిజం చెప్పరాదు. చెబితే అగ్నిపరీక్ష తప్పదు. పెళ్ళి సందర్భంలో కట్నాల ప్రసక్తి వస్తే, ప్రకాశం తాను కట్నాలివ్వలేనని ఏనాడూ అనలేదు, కట్నాల ఆచారాన్ని దుమ్మెత్తి పోశాడు. అందుక్కూడా నేను తప్పు పట్టను; కట్నం ఇవ్వనని శపథం పట్టినవాడు కట్నం తీసుకోకుండా వచ్చే అల్లుణ్ణి చేసుకోవటానికి సిద్ధంగా వుండాలి_అంతకన్న ముఖ్యం, తన కూతుర్ని సిద్ధపరచాలి. ప్రకాశం ఈ రెంటిలో ఏదీ చెయ్యలేదు. తన తండ్రి వైఖరి తన పెళ్ళికి సైంధవుడల్లే అడ్డ పడిందని లీలకు తోచి ఉండవచ్చు....దానికి చదువుమీద విరక్తి పుట్టి జీవితంపైన ఆశపుట్టి వుండవచ్చు....

ఏమైనా, లీల పరీక్ష తప్పటానికీ, దాని పెళ్ళి కనుచూపు మేరలో లేకపోవటానికీ సంబంధం వుంది.

"ఏమే, కోడలా? నీకు పెళ్ళి చేసుకోవాలని వుంటే నాతో చెప్పు. మీ నాన్నను ఎగదోస్తాను. చేతులు కట్టుక్కూచుంటే అయేవికావు పెళ్ళిళ్లు" అని లీలను కదిపి చూశాను.

"ఎప్పటికైనా పెళ్ళి జరగాలిసిందేగా? ముందీ పరీక్ష ప్యాసుకానీ!" అన్నది లీల.

"ఒరే నీ కూతురికి సంబంధాలు చూడడం మొదలు పెట్టొచ్చు" అని ప్రకాశంతో అన్నాను.

"ఎక్కడని చూడటం? ఎక్కడన్నా ఫలాని సంబంధం ఉందని నీ బోటివాడెవడన్నా అంటే అలాగే చూడొచ్చు."

"ఏవో సంబంధాలుండకపోతాయా? పెళ్ళికావలసిన ఆడపిల్లల్లాగే పెళ్ళికావలసిన మగపిల్లలూ ఉంటారు. ముందు తేల్చవలిసింది నీ ఉద్దేశం, మీ ఆవిడ ఉద్దేశం, లీల ఉద్దేశం. వీటిని బట్టి సంబంధాలు వెదకాలి. అందులోనూ నువు లక్ష నియమాలు గలవాడివైతివి" అన్నాను.

చిన్నమీటింగు జరిపాం_నేనూ, ప్రకాశమూ, వాడి భార్య, వాళ్ళపెద్దవాడూ, కొంచెం దూరంగా లీలా.

"నియమాల దేముందీ? పిల్లను తీసుకుపోయి చూస్తూచూస్తూ పశువుల

మధ్య పడెయ్యలేం గదా ? కా స్త సంస్కారం ఉండి, మనభాష వాళ్ళకీ, వాళ్ళ భాషమనకీ అర్థం కావటం ప్రధానం. మిగిలిన విషయాలు మామూలే," అన్నాడు ప్రకాశం.

"పిల్లవాడి రూపురేఖలతో పని లేదా ?"

"అదేమిటన్నయ్యా ? పిల్లవాడు కాస్త బాగుండొద్దూ ? లేకపోతే నలుగురూ నవ్వరూ ?" అన్నది ప్రకాశం భార్య.

"చదువు ?"

"చదువుకన్న సంస్కారం ముఖ్యమనుకో. అయినా అది బియ్యే చదివినప్పుడు కనీసం బియ్యే అయినా చదవనివాడు దాన్ని ఎట్లాగూ పెళ్లి చేసుకోడు." అన్నాడు ప్రకాశం.

"ఆస్తి ?"

"ఉంటే మంచిది. లేకపోయినా పెళ్ళాన్ని పోషించేపాటి సంపాదన ఉన్నా చాలు," అన్నాడు ప్రకాశం.

"కట్నం మాట ?"

"రామాయణమంతా విని.... ! ఇది మరీ బాగుంది. కట్నం అడిగేవాణ్ణి నువ్వు మనిషి కింద చూడగలవురా ?" అన్నాడు ప్రకాశం. అప్పుడే ఆవేశం వచ్చింది.

"తొందర పడకు: ఇప్పుడు కొందరేం చేస్తున్నారో తెలుసా ? మీరేమిస్తారో చెప్పండి అంటారు. ఏమీ ఇవ్వమంటే, మావాడిప్పుడప్పుడే పెళ్లి వద్దంటున్నాడని ఉత్తరం ముక్క రాస్తారు. ఏవో లాంఛనాలిస్తామంటామనుకో, ఆ తరువాత నువు ఇవ్వని వన్నీ కోరి, "లాంఛనాలకింద ఇవన్నీ వస్తాయని మీకు తెలీదా ? అడిగించుకోవాలా ? కొత్తగా సీమనించి దిగొచ్చారా ?' అని నిష్ఠూరా లాడతారు. అంచేత మనం అన్నిరకాల వాళ్ళనూ ఎదుర్కోటానికి సిద్ధంగా వుండాలి."

"అటువంటి వాళ్ళతో అంతసేపు మనం మాట్లాడనేరాదు. వ్యవహారం సూటిగానూ, సాఫీగానూ నడవాలి సిందేగాని, డొంక తిరుగుళ్ళలో పడటం నాకు పరమ అసహ్యం" అన్నాడు ప్రకాశం.

"పరిస్థితులు బలవంత పెడుతుంటే మన కిష్టంలేని పనులెన్నో చెయ్యాలి సొస్తుంది. నీకు మాత్రం ఆ సంగతి తెలీదా ?" అన్నాను.

ప్రకాశం భార్య చాలాసేపు విని, విని, "అన్నయ్యా, మీ రాయన మాటలు లక్ష్యపెట్టకండి, ఆయన ఈ లోకం గురించి మాట్లాట్టంలేదు. కట్నం ఇచ్చుకోకుండా సంబంధాలు దొరకడంవల్ల అత్తగారికీ, ఆడబిడ్డలకూ లాంఛనాలు జరపాలిసిందే. అల్లుడు రిస్టువాచీతెమ్మన్నా, స్కూటరు తెమ్మన్నా, సూట్లు కుట్టించమన్నా సరేననాలిసిందే—" అని ప్రారంభించింది.

ప్రకాశం ఆముదం తాగినవాడి ముఖంపెట్టి," ఛీ ! వీడిదుంపతెగా !" అన్నాడు—స్కూటర్లూ, సూట్లు అడిగే అల్లుణ్ణే అయి ఉంటుంది.

"ఇకనైనా ఈ చర్చ ముగిస్తారా?" అన్నది లీల చూసి చూసి.

కాని చర్చలకు ఎమర్జన్సీ బ్రేకు లుండవు. భరించలేక లీల లేచి పోయింది. దాని అన్న గడియారంకేసి చూసి తానూ వెళ్ళిపోయాడు. ప్రకాశానికూడా ఎక్కడికైనా పారిపోదా మని ఉన్నట్టే కనిపించాడు, వాడు చిట్ట చివరకు సారాంశం చెప్పేశాడు. "నాకు ప్రపంచజ్ఞానం లేదని ఒప్పు కుంటా. కాని మీరందరూ ఇన్నాళ్ళుగా నాకు జ్ఞానోదయం కలిగించినా, మీరు చెప్పే ప్రపంచమంటే నాకు రోతజాస్తి అవుతున్నది గాని తగ్గటం లేదు. ఈ కోల్డ్‌వార్ పెళ్ళిళ్ళు నేను మీదవేసుకో లేను. అటువంటి పెళ్ళే లీలకు చెయ్యా లనుంటే మీరెవరైనా సారధ్యం చెయ్యండి. అంతేగాని నా చేతగాని పని చేయించవద్దు. ఈ కట్నాలేమిటి, బేరా లేమిటి, అలక లేమిటి, నిష్ఠూరా లాడ టమూ, పడటమూ_ఏమి టిదంతా? నా కర్మేం కాలిందని నేను వీటన్నిటికీ ఒడి గట్టాలి?....ఆడపిల్లను కన్నాక తప్పు తుందా అంటుంది ఈ మట్టి బుర్ర. ఆడపిల్లను కనటం ఒక మహాపరాధ మనీ, ఆ పని చేసినవాడికి శిక్ష పడాలనీ అనే వాళ్ళను జైల్లో పెట్టటాని కొక లా వుండాలంటాను. ఎవరూ ఆడ పిల్లలను కనకపోతే మగవాళ్ళంతా ఏ గంగలో దూకుతారు? ఆడది అక్కర్లేని మగ వెధవ ఎవడు? అన్నం తినటం రైటూ, వండటం తప్పూనా? తలకు మాసిన వెధవలు! తలకు మాసిన జాతి! జాతంతా పుచ్చి పురుగులు పడిపోతున్నా కళ్ళు తెర వరు....నేను ఏనాడో లీల జీవితానికి రాజబాట నిర్మించాను. అలాగే జరుగు తుంది. అది ముందు ఉద్యోగం_ఏదో చిన్న ఉద్యోగం _ సంపాదించు కుంటుంది. అది సంపాదించే జీతం రాళ్ళకు ఆశించి అయినా ఎవరో ఒకరు పెళ్లాడతామని రాకపోరు. ఇద్దరేవచ్చినా అందులో కాస్త మెరుగైనవాణ్ణి చేసు కుంటుంది."

ప్రకాశం అందరినోళ్ళూ ఒక్కసారి మూసేశాననుకుని ఉంటాడు. కాని అదేమీ జరగలేదు.

"దాని జీవితం రాళ్ళకు ఆశపడి వచ్చేవాడు మంచివాడూ, కట్నానికి కాశపడే వాడు చెడ్డవాడూనా? ఇద్దరిలో

---

★ "ఈసారి మాకు అబ్బాయి పుడతాడని మా ఆవిడ, అమ్మాయి పుడు తుందని నేను పందెం వేసుకున్నాం."

"ఎవరు గెలిచారు?"

"ఇద్దరమూ."

# పోటీదార్లకు మనవి

"జ్యోతి" మాసపత్రిక కళాశాలల, విశ్వవిద్యాలయాల విద్యార్థినీ విద్యార్థుల నిమిత్తం "చిన్న చిన్న కథల పోటీ" నిర్వహిస్తున్నది. దీనిలో పాల్గొనేవారు ఈ క్రింది నిబంధనలు పాటించ గోరుతున్నాము.

1. కథలు "జ్యోతి"లో రెండు మూడు పేజీలకు మించరాదు.

2. స్వకపోల కల్పితమైనస్వతంత్ర రచనలే పంపించాలి.

3. తమ పూర్తిపేరు, చదువుతున్న తరగతి, కాలేజీ, లేక విశ్వవిద్యాలయం పేరుతో సహా పూర్తి చిరునామా జత పరచాలి.

4. ప్రతినెల 1వతేదీ వరకు అందిన రచనలనే ఆ పైనెల సంచికలో పోటీకి పరిగణిస్తాము.

5. బహుమతి పొందని రచనలు త్రిప్పి పంపబడవు. అందు చేత స్టాంపులు పంపించ నవసరం లేదు. రచనల విషయమై ఉత్తర ప్రత్యుత్తరాలు జరుపబడవు.

6. కవరు మీద "జ్యోతి, చిన్న చిన్న కథల పోటీకి" అని స్పష్టంగా వ్రాయాలి.

7. రచనలను పంపవలసిన చిరునామా ఎడిటర్, "జ్యోతి" సచిత్ర మాసపత్రిక, విజయవాడ-2."

8. రూ. 50లు ప్రథమ బహుమతి. రూ. 25 లు చొప్పున రెండు ద్వితీయ బహుమతులు.

మెరుగైన వాణ్ణి అది ఏరుకోవటం మంచీ, పదిమందిలో మంచివాడుగా చూసి మనం ఏరి చెయ్యటం చెడూనా? ఏం చెబుతారండీ?" అన్నది వాడి భార్య.

తనవంటి మేధావిని తనభార్యవంటి వంటింటి బానిస అంత సులువుగా ఓడిస్తుందని ప్రకాశం అనుకుని ఉండడు. నేనేవాణ్ణి సమర్థించాను.

"అవునమ్మా, అదేమంచిది. నువ్వు గ్రహించలేవు. కట్నంకోసం ఆశపడ్డ వాడు మనిషికివిలువఇవ్వడు లీలసంపాదనను గౌరవించేవాడు లీలనూ గౌరవిస్తాడు. అంతేకాదు;ఇంకోరు కుదిర్చిన సంబంధంకన్న, తాను నిర్ణయించుకున్న సంబంధం మగవాడికి ఎప్పుడైనా ఎక్కువే. అసలు చిక్కు అది కాదు. ప్రకాశం చెప్పినట్టుగా పెళ్ళి జరగటానికి కూడా సవాలక్ష ప్రతిబంధకాలుంటాయి. అంతా దైవాధీనం. లీల వుద్యోగంలో చేరిన రోజే దాని కాబోయేవాడు నిర్ణయం కావచ్చు. లేదా ఏళ్ళ తరబడి వాడి జాడే లేకపోవచ్చు" అన్నాను.

ఆ తరవాత మేం అంత దీర్ఘంగా లీల పెళ్ళి గురించి చర్చించలేదు.

లీల మళ్ళీ పరీక్షకు కూర్చుంది— మళ్ళీ తప్పింది.

(ఇంకా వుంది)

# మారిన జీవితం

## కొడవటిగంటి కుటుంబరావు

(గత సంచిక తరువాయి)

### 3

ప్రకాశం చేతులు కట్టుకు కూర్చున్నా, వాడి వైపువాళ్ళు ఊరుకోలేదు. వాడి చిన్నాన్న ఒక సంబంధం ఉందని రాశాడు. అలాగే వాడి పెదనాన్న కూతురూ, మేనమామ కొడుకూ, హైదరాబాదులో ఉన్న వాడి తమ్ముడూ, ఇద్దరు బావమరుదులూ ఏవేవో సంబంధాలు సూచిస్తూ రాశారు. వరులు రకరకాలుగా ఉన్నారు—చదువుండి డబ్బు లేనివాళ్ళూ, డబ్బుండి చదువు లేనివాళ్ళూ, హోదా లున్నవాళ్లూ, లేనివాళ్లూ, డబ్బూ హోదా కూడా ఉన్న ఒక రెండో పెళ్ళివాడూ (ముగ్గురు కుమార్తెల తండ్రి), పెద్ద చదువులకు పై దేశాలకు పోదామనుకుంటున్న వాళ్లూ. కట్నాలు అందరూ అడిగారు. ఎవరి తాహతునుబట్టి వారడిగారు; ఒక్క రెండో పెళ్ళాయనే పెళ్ళి గుట్టు చప్పుడు కాకుండా జరగా లన్నాడు.

కొందరు పిల్లను చూడటానికి వచ్చారు. కొందరు వస్తామని రాలేదు. ఒక సంబంధంవాళ్ళు మటుకు పిల్లను తెచ్చి తమకు చూపించమన్నారు; చూడవలసిన బలగం చాలా ఉందిట. వాళ్ళ ఉత్తరం చూస్తూనే ప్రకాశం, "ఇటువంటి దగుల్బాజీ సంబంధాలు చచ్చినా చెయ్యగూడదు" అన్నాడు. ఆ రాత్రి బండికే పిల్లను వెంట బెట్టుకు పోయి చూపించి, వరుణ్ణి తాను చూసి తిరిగి వచ్చేశాడు. ఆ వరుడికన్న కోతి నయమట. అందుకె వాళ్ళు వాణ్ణి పెళ్ళి చూపులకు పంపి ఉండరు.

మొత్తంమీద లీలను చూడవచ్చిన వాళ్ళు అయిదారుగురుంటారనుకుంటాను. వాళ్ళలో ఇద్దరు ప్రకాశం భార్యకు నచ్చారు. మరొకడి ఆస్తి నచ్చింది. లీలను అభిప్రాయం అడిగితే ఎవరికీ నచ్చని వాణ్ణే ఫరవాలేదని పాస్‌చేసి, మిగతా వాళ్ళను గురించి "నాకు తెలీమ" అనేసింది. బొత్తిగా మతిపోయి ఉంటుంది.

ప్రకాశం సంగతి వేరే చెప్పనక్కర్లేదు. ఒక్కరూ నచ్చలేదు — ఎందుకంటే, అందరూ కట్నాలు బేరం పెట్టినవాళ్ళే. రెండో పెళ్ళాయన కట్నం అడగలేదు. పిల్లను చూడనక్కర్లేదని కూడా రాశాడు. అందుచేత ఆయన్ని చూసే అదృష్టం మాకెవరికీ పట్టలేదు.

పెళ్ళిచూపులకు వచ్చినవారిలో ఒకడికి తప్ప లీల అందరికీ నచ్చింది. దురదృష్టవశాత్తూ పిల్ల నచ్చినవాడు ప్రకాశం భార్యకు అందరికన్నా బాగా నచ్చినవాడు. అలాంటి ఆశాభంగాలు జీవితంలో సాధారణంగా జరిగేవే.

ఇంత హడావుడి జరిగాక లీల పెళ్ళి సమస్య, సామెతలో గొంగళిలాగా వేసినచోటే ఉండిపోయింది.

"దాని కింకా పెళ్ళి ఘడియ రాలేదు లాగుంది" అన్నది ప్రకాశం భార్య.

"అసలు ఆడపిల్లల పెళ్ళి ప్రయత్నం జరగవలసింది ఇలా కాదు" అన్నాడు ప్రకాశం.

"ఎలా జరగాలి?" అన్నాను, తెలుసుకుందామని. అది ప్రకాశానికూడా తెలిసినట్టు కనబడలేదు. ఎవడైనా సర్వలక్షణ సమన్వితుడు ఎక్కడినుంచో ఊడిపడి, "అయ్యా, నేను మీ లీలను తప్ప చేసుకోదలచలేదు. నాకు కట్నం వద్దు. సాధ్యమైనంత తక్కువ ఖర్చులో పెళ్ళి చేసెయ్యండి అన్నట్టయితే అది సరయిన పద్ధతి అని ప్రకాశం ఉద్దేశం లాగుంది.

నేను తనపట్ల సానుభూతిగా లేనని తెలిసి ప్రకాశం, "నీ సలహా ఏమిటి?" అన్నాడు.

"దాని పెళ్ళిదానికే వదిలెయ్యి. నువ్వసలు చిన్నతనం నుంచీ లీలకు, నీ పెళ్ళి నువ్వే చేసుకోవాలని నూరిపొయ్యవలసింది. నీ ఇంటి వాతావరణమూ, నీ అభిప్రాయాలూ దానికి గోడలాగా కట్టేశావు" అన్నాను.

"చాల్లే ఊరుకోండి! ఎవరన్నా వింటే నవ్విపోతారు. దాని పెళ్ళి అది చేసుకోవటమేమిటి? దానికేం తెలుసు, దాని మొహం? కుండపెంకు మొహం వాణ్ణి చూసి వాణ్ణి పెళ్ళాట్టానికి తన కభ్యంతరం లేదనేసిందిగదా!" అన్నది ప్రకాశం భార్య.

"ఇరవయ్యేళ్ళొచ్చి బి యే చదివే పిల్లకు ఏమీ తెలీదంటే తప్పెవరిదై ఉంటుంది?" అన్నాను.

"ఒకవేళ దానికి తెలిస్తేమాత్రం, ఆడపిల్ల తన పెళ్ళి తానెట్టా చేసుకుంటుం దన్నయ్యగారూ? ఎక్కడా లేనిమాటా!"

"మీ మగపిల్లలు రేపు వాళ్ళ ఉద్యోగాలు వాళ్ళు చూసుకోరుటమ్మా, పిచ్చిదానా? ఉద్యోగం చూసి పెట్టమని అమ్మనీ, నాన్ననీ అడుగుతారా? దాని పెళ్ళి అది చేసుకోవటమంటే దాని మొగుణ్ణి అది చూసుకోవట మన్నమాట. పెళ్ళి తంతు మనం జరిపిస్తాం" అన్నాను.

"అది అజ్ఞానంచేత తప్పటడుగేసి గోతిలో పడితే?"

"మనం తెలీక దాన్ని గోతిలోకి తోస్తేనో? ఇంకొకరి పొరపాటుచేత గోతిలో పడటంకన్న ఎవరి పొరపాటు చేత వాళ్ళు గోతిలో పడటం మెరుగు కాదూ? అయినా లీలను రహస్యంగా పెళ్ళాడ మంటున్నానా? సలహా ఇవ్వటానికీ, మరీ పెడదోవన పడితే ఇవతలికి లాగటానికీ మనం లేమూ?"

ప్రకాశం భార్యకు నా సలహా ఏ మాత్రమూ నచ్చలేదు. ఆవిడ నా మాట లన్నిటికీ తల అడ్డంగా తిప్పి, "అది జరిగేది కాదులెండి" అన్నది.

జరగదని నాకు మాత్రం తెలీదా? ప్రకాశం అడిగిన దానికి నాకు తోచిన సమాధానం చెప్పాను. అసలు వాడు నా చేత ఈ మాటలు చెప్పించి ఉండ నవసరం లేదు. వాడి విశ్వాసాలను సాగదీస్తే నేను చెప్పినట్టే చేసితీరాలి. తన విశ్వాసాలకు పర్యవసానమేమిటో వాడు ఏనాడూ స్పష్టంగా ఆలోచించ లేదు.

చివరకు, ప్రకాశం భార్య అన్నట్టు, లీలను దానికాకాబోయేవాడు వెతుక్కుంటూ రానే వచ్చాడు. అలా అనటంలో అతిశయోక్తి ఏమీలేదు. అటువంటి మనిషి ఒకడున్నాడని కూడా మాకెవరికీ తెలియదు. లీలను పెళ్ళి చూపులుచూసివెళ్ళిపోయిన కుర్రాళ్ళలో ఒకడికి అతను స్నేహితుడు దూరపు బంధువూ అని విన్నాను. అతను గేటు దగ్గిరికి వచ్చి, "ప్రకాశం గారిల్లు ఇదేనాండీ?" అని అడిగితే వరండాలో కూర్చుని ఏదో వారపత్రిక చదువుకుంటున్న లీల సరిగా తలఎత్తి అయినా చూడకుండా, "ఇంట్లోలేరండీ" అన్నది.

ఆ సంగతి తెలుసుకున్నవాడు వెళ్ళిపోక, గేటు తెరుచుకుని లోపలికి రావటం గమనించినమీదట లీల అతన్ని పరీక్షగా చూసింది. ఎరిగినవాడు కాడు, చూసిన మొహమైనా కాదు. అతను వరండా మెట్లమీది దాకా వచ్చి, "ఊళ్ళో ఉన్నారుగద?" అన్నాడు.

"ఏదో పనిమీద బయటి కెళ్ళారు. త్వరలోనే రావచ్చు" అన్నది లీల. అతను తనకేసి తెగ చూడటం అది గమనించిందిట. అతను వరండాలోకి అడుగు పెడుతూ, "అయితే వారి కోసం వెయిట్ చేస్తాను" అన్నాడు.

లీల తాను కూర్చున్న కుర్చీ ఖాళీ చేసి లోపలికి పోబోతూ అతని పేరడిగింది. అతని పేరు కోటేశ్వర్రావు. కూతురు వరండాలో ఎవరితోనో మాట్లాడుతూండటం ఆలకించి ప్రకాశం భార్య కిటికీగుండా కోటేశ్వర్రావును చూసి, అతను లీలను చూటానికి వచ్చాడని అప్పుడే అనుకుందిట। ఒకవేళ అనుకుందేమో—మన మెందుకు కాదనాలి?

ప్రకాశం ఇంటికి తిరిగివచ్చి, కోటేశ్వర్రావు పెళ్ళి చూపులకు వచ్చాడని తెలుసుకున్నాడు. ఆ ముక్క చెవిని పడగానే ప్రకాశం భార్య చప్పున రంగంలోకి వచ్చేసిందట—తన మొగుడు ఎక్కడ రసాభాసు చేసిపోతాడోనని.

జరగవలసిన మాటలు జరిగాయి.

పై చూపులకు కోటేశ్వర్రావు అందరికీ తృప్తికరంగా కనపడ్డాడు. అతనికి

పెద్ద కథ

పాతికేళ్ళు మించవు. చూడటానికి బాగానే ఉన్నాడు. చాలా సాత్విక స్వభావుడూ, మానమర్యాదలు తెలిసినవాడు లాగా కనబడ్డాడు. బాగా ఆస్తి ఉందిట. బి. యస్సి. ఫస్టుక్లాసులో ప్యాసయాడు. తండ్రిపోయాక చదువుకు స్వస్తిచెప్పి ఆస్తి చూసుకుంటున్నాడు. కట్నం అడగలేదు. లీల తనకు నచ్చిందని చెప్పేశాడు. ప్రకాశం వాళ్ళ అభిప్రాయాన్ని తనకు ఉత్తరంద్వారా తెలియజేయ మన్నాడు. ఈ సంగతులు మాత్రమే చెప్పి కోటేశ్వర్రావు తన అడ్రసిచ్చి శలవు పుచ్చుకున్నాడు.

ఈ సంబంధం రావటం చూసి అందరికన్న సంతోషించినది ప్రకాశం భార్య. ఆవిడ అంతరిక్షయానం ఎక్కిన దానిలాగా పూర్తిగా భారరహితమై పోయి, "ఇంతకన్న మంచి సంబంధం వెయ్యేళ్ళు తల కిందుగా తపస్సు చేసినారాదు. మనచేతుల్లో ఏమీలేదర్రా. ఆ ఘడియవస్తే___" అంటూ ఏమేమో అనేసింది.

ప్రకాశం భారరహితస్థితిని అందు కోలేదు. అంతో ఇంతో తన బరువు పెంచుకుని, వంక పెంచటానికే ప్రయత్నించి ఉంటాడని తోస్తుంది. "ఎవరో పెళ్ళి చూపులకు వచ్చారట. ఎట్లా ఉన్నాడు కుర్రాడు?" అని నేనడిగితే "ఏదీ, ఇంకా పూర్తి వివరాలు తెలియాలి!" అన్నాడు ప్రకాశం నిబ్బరంగా.

లీల నడిగితే తనకేమీ తెలియదన్నది.

"కుర్రాడు చూపులకెట్లా ఉన్నాడు. అదైనా తెలీదా?" అన్నాను.

"మనిషిలా గున్నాడు," అన్నది లీల.

"అదీ మెరుగే_కోతిలాగా లేడన్న మాట" అన్నాను.

"దానికేం తెలుస్తుం దన్నయ్యగారూ. కుర్రాడు నిక్షేపంలా ఉన్నాడు. వంక పెట్టటానికి వీల్లేని సంబంధం. ఆ అబ్బాయిని చూస్తూనే పెళ్ళి చూపులకు వచ్చాడని అప్పుడే అనుకున్నా!" అన్నది ప్రకాశం భార్య. "సంబంధం నచ్చిందని రేపే ఒక ఉత్తరం ముక్క రాసి పడెయ్యండి" అని ఆవిడ ప్రకాశాన్ని హెచ్చరించింది.

"అన్నట్టు అతను రాసిచ్చిన అడ్రసేదీ?" అన్నాడు ప్రకాశం.

---

★ ఒకడు స్నేహితుడి ఇంటికి వెళ్ళి ఆరేళ్ళ కుర్రాణ్ణి అడిగాడు : మీ నాన్న ఇంట్లో వున్నాడా?"

కుర్రాడు లోపలికి వెళ్ళివచ్చి : "మా నాన్నగారు ఇంట్లో లేరని చెప్పమన్నారు."

"అయితే నేను రాలేదని చెప్పు."

ఆ కాగితం ఎప్పుడు చేరిందో ఎలా చేరిందో లీల దగ్గిరికి చేరింది. దాన్ని అది ఎక్కడో భద్రంగా దాచింది. తండ్రి అడిగినమీదట దాన్ని తెచ్చి ఇచ్చింది.

ప్రకాశం దాన్ని ఏగాదిగా చూసి, "కానూరు అగ్రహారమా? ఇది ఏదండకారణ్యంలో ఉన్నట్టు?" అన్నాడు.

"జిల్లాకు ఒకటి రెండు కానూర్లు ఉండవచ్చు" అన్నాను.

"జిల్లా, తాలూకా, వయా, వేరే పోస్టూ ఇన్ని వున్నాయి ఈ మహా నగరానికి. ఏదో దిక్కుమాలిన పల్లెటూరై వుంటుంది. లీల అక్కడ కాపరం ఎలా చేస్తుంది?" అన్నాడు ప్రకాశం. వాడి బరువు చూస్తుండగానే రెట్టింపయింది.

అంత దాకా భారరహిత స్థితిలో వున్నవాడి భార్యకు కూడా కొంత బరువు ఏర్పడసాగింది. అంతరిక్ష యానం ఎత్తునుంచి దిగి వచ్చేస్తున్నట్టయింది.

"మీరు లేనిపోని వంకలన్నీ పెట్టటం మొదలెట్టకండి. నిక్షేపంలాటి సంబంధం!" అన్న దావిడ.

"కాస్త గుర్రం కట్టెయ్యి, తెలుసుకోవలిసిన విషయాలు చాలా ఉన్నాయి" అన్నాడు ప్రకాశం.

## 4

ఏ క్షణంలో ప్రకాశం ఆ మాట అన్నాడో గాని. వా డన్నంతా అయింది. చాలా విషయాలు క్రమంగా తెలియ వచ్చాయి.

కోటేశ్వరరావు కు ఒక పెళ్ళి అయింది. నెల రోజులు కాపరం చేసి అతని భార్య పోయింది. అత నిప్పుడు చేసుకోవా లనుకుంటున్నది రెండో పెళ్ళి!

ఈ విషయం హెచ్చుగా ఆందోళన పరిచింది ప్రకాశం భార్యని. లీల ఆశ అంటూ పెట్టుకుని ఉంటే, దానికూడా ఆశాభంగం కలిగి ఉండొచ్చు. రెండో పెళ్ళి వాడనే పాయింటు మీద ఆవిడ కోటేశ్వరరావును వదులుకునే టందుకూడా సిద్ధపడింది.

ఒక నెలరోజులు కాపరం ఒక లెక్కలోది కాదనీ, దాన్ని గురించి అంత ఆందోళన పడనవసరం లేదని నే నావిడికి నచ్చజెప్ప యత్నించాను. "రెండో పెళ్ళివాడు" అన్నమాట ఆవిణ్ణి మహా బాధించినట్టు కనపడ్డది. లీల మనసును కెలికినది ఆ మాటకాదు. సెకండ్ హాండ్ మొగుడు అన్నమాట. ఎవరి వర్జ్య పదాలు వాళ్ళ కుండటం సహజమేగద.

నన్ను కెలికేమాట "దత్తపుత్రుడు". కోటేశ్వరరావు దత్తు తీసుకున్న వాడే. ఈ సంగతి మొదటే తెలిస్తే నేను, అతను రెండో పెళ్ళివాడని వెంటనే ఊహించి ఉందును. కుర్రవాణ్ణి దత్తు తెచ్చుకునే వాళ్ళు, వాడిచేత బంధువర్గంలో ఎవతెనో చూసి దాని మెళ్ళో మూడుముళ్లూ వేయించకుండా వదిలిపెట్టరు. వాడికిపిల్లనచ్చక్కర్లేదు; తనకు

కాబోయే పిల్లను చూసినప్పుడల్లా వాంతు లయినా సరే వాడు దాన్ని చేసుకుతీరాలి. చచ్చితీరాలి. ఇంపీరియలిస్టు దేశాల ఆర్థిక సహాయానికున్నట్టే. దత్తతక్కూడా తోకలుంటాయి.


ప్రకాశం వాళ్ళు నా సలహా అడిగి ఉంటే, దత్తుడయినందుకు ఈ సంబంధం వదులుకోమని సలహా ఇచ్చి ఉందును. వాళ్ళు నన్ను అడగాలేదు. నేను ఇవ్వాలేదు.

రెండో పెళ్ళి వాడయినా రానందుకు పరిమితంగా దిగులుపడి, సంబంధానికి మనసును సమాధాన పరుచుకుందామనుకుంటుండగా ప్రకాశం భార్య మెదడులో ఇంకో వికారమైన మెరుపు మెరిసింది.

"కుర్రాడి జాతకంలో కుజ దోషం వుందేమోనండీ. మా పెద్ద మేనమామకిట్లాగే కుజ దోషం వుండి ఇద్దరు భార్యలు పోయాక, కుజదోషం వున్న దాన్నే చూసి చేశారు. ఎందుకన్నా మంచిదని మూడో పెళ్ళికి ముందు ఆయనచేత అరిటిచెట్టుకు తాళి కట్టించారు!" అన్నదావిడ.

"అఘోరించలేక పోయారు! కుజ దోషమట. కుజదోషం!" అని ప్రకాశం చిందులు తొక్కాడు.

"దేన్నీ నమ్మకపోతే ఎలాగండీ?



కాస ఆ అబ్బాయి జాతకం తెప్పించి ఎవరికన్నా చూపిస్తేగాని నా మనస్సు కుదుటపడదు" అన్నదావిడ.

"వాళ్ళు తప్పుడు జాతకం పంపిస్తే ఏం చేస్తావు ? నీ కూతురి జాతకం చూపించుకుని దాని ఆయుర్దాయం గట్టిగా వుందో లేదో చూసుకోవటం తేలిక కాదూ ?" అన్నాడు ప్రకాశం.

ప్రకాశం భార్య చివరకు ఆ పనే చేసింది. ఆవిడకు కుజదోషం భయం బాగా పట్టుకున్నది. అందుచేత లీల జాతకాన్ని ఒకరి కిద్దరు జ్యోతిష్కులకు చూపించింది. ఇద్దరూ లీలది దీర్ఘాయువనే చెప్పారు. ఒకడు సంపన్నుల ఇంటి కోడ లవుతుందని కూడా చెప్పాడు. ఆవిడ ఈ సంబంధానికి లైన్ క్లియ రిచ్చేసింది.

ప్రకాశమే ఇంకా ఎటూ తేల్చుకోలేదు. ఈ సంబంధానికి గట్టి అభ్యంతరం ఏం చెప్పాలో వాడికింకా తట్టనట్టు కనపడ్డాడు. శాస్త్రోక్తమైన పెళ్ళికి అభ్యంతరం చెప్పి చూద్దామని, తనకు మంత్రాలపెళ్ళి ఇష్టంలేదనీ, అందులో తనకేమీ నమ్మకం లేదనీ, కోటేశ్వరరావు వచ్చి ఓ పదిహేను రోజులు పట్నంలో కూర్చుంటే రిజిస్ట్రారుదగ్గిర పెళ్ళి చేద్దామనుకుంటున్నాననీ ఉత్తరం రాశాడు.

తనకు రిజిస్టరు పెళ్ళి అభ్యంతరం లేదనీ, ఆమాట అందామని తననోటి దాకా వచ్చికూడా, ఏమనుకుంటారోనని అనలేదనీ కోటేశ్వరరావు ఉత్తరం రాశాడు.

ఉత్తరం వచ్చిన మూడోరోజుకు అతనే దిగాడు. పెట్టే బేడాతో సహా.

అదే నేనతన్ని మొదటిసారి చూడటం. మనిషిని చూసి వంక పెట్టటానికి లేదు. నా తల వెంట్రుకలంత మంది దంపతులను చూశాను. ఒకరికొకరు ఈడైనప్పుడు కూడా జోడుగా వుండటం చాలా అరుదు. కోటేశ్వరరావు లీలకు ఈడుగానూ, జోడుగానూ కూడా వున్నాడు.

అతను వచ్చిన రోజే రిజిస్ట్రారాఫీసుకు వెళ్ళి పెళ్ళి దరఖాస్తు పడేస్తానని ప్రకాశాన్ని వెంటబెట్టుకుని బయలుదేరాడు.

ప్రకాశం భార్య నాతో, "చూడండన్నయ్యా, ఈ అబ్బాయి మీరు రాక ముందు చాలా మాట్లాడాడులెండి. అతని ధోరణి చూస్తే అతనీ పెళ్ళి రహస్యంగా చేసుకుంటున్నాడా అని నాకు అనుమానంగా వుంది. తాను పెళ్ళి ప్రయత్నాలు చేసుకోనవసరం లేదుట. తనవైపున పెళ్ళి కెవరూ రారుట. శుభలేఖలు కూడా అవసరం లేదంటాడేమిటండీ ?" అని ఆందోళనతో అన్నది.

"ఇతన్ని గురించి మనకు తెలిసిందంతా ఇతను చెప్పిందేనా? లేక మూడో వాళ్ళ నుంచి తెలిసిం దేమైనా ఉందా?" అని అడిగాను.

"ఏదీ ? మీ బావగారు మూడు ఉత్తరాలు రాశారు. మొత్తం మూడింటికీ జవాబు లిచ్చాడు. ఉత్తరాలు ఇంగ్లీషులోనే రాయమన్నాడు సుమండీ. ఇంతలో అతను

రానే వచ్చాడు. మూడో మనిషితో మాట్లాడేటందుకేదీ ? అతనివైపు మగవాళ్ళెవరూ లేరట. జాతకంలో కుజ దోషం వుందా అంటే తనకసలు జాతకమే లేదన్నాడు. ఎంత ఇంగిలీషు నాగరికతైనా కాబోయే అల్లుడి తాలూకు బంధువులతో మాట్లాడకుండానూ, చెందకుండానూ పిల్లనెట్లాయిస్తాం చెప్పండీ. పోనీ, మన సరసనే కాపరం పెట్టేమాటుంటే అతని బంధు వర్గంతో మన కేమిటనుకోవచ్చు. అలాకుదరదుట. పట్నంలో కాపరం పెట్టడట. అక్కడ భూములూ, పుట్రలూ తానే స్వయంగా చూసుకోవాలిట. లీలకు పల్లెటూరికాపరం తప్పేట్టులేదు—అంటే, ఈ సంబంధం అయేటట్టుంటే. చెప్పుల్లోకాళ్ళుచెప్పుల్లో వుండగానే పెళ్ళి దరఖాస్తువేస్తానని బయలుదేరాడు. నన్నెవరో తరుముతున్నట్టుందంటే నమ్మండి. దరఖాస్తు వేస్తే పెళ్ళి మానటానికుండదా ?" అన్నది ప్రకాశం భార్య.

చిన్న డిటెక్టివు నవలలాగా తయారవుతున్నది లీలపెళ్ళి. ఈ మిస్టరీలో లీల అల్లి ఊహాకల్పన ఎంతో నిర్ణయించటానికి నాకాధారం లేదు.

"ఇంతకూ మనకొచ్చిన భయమేమిటి ? కీడెంచి మేలెంచటం తప్పు లేదుగా ? ఇతను తనపెళ్ళి గోప్యంగా ఉంచుతున్నాడే అనుకుందాం. అందుకు తగిన కారణం ఉండనే ఉన్నది. అతను చేసుకుంటున్నది రెండోపెళ్ళి. మొదటిభార్య పోయింది. రెండోపెళ్ళి క్లుప్తంలో పోవాలనుకోవటంలో తప్పేమిటీ ?"

"మొదటి పెళ్ళాం ఒకవేళ బతికే ఉంటే ?" అన్నదావిడ.

"ఆ అనుమానం పూర్తిగా నిరాధారమేనని చెప్పగల్ను. అతను తనకదివరకు ఒకపెళ్ళి అయిందని చెప్పకపోతే మనం తెలుసుకోగలమా ? అదొక పాయింటు. రెండోపాయింటేమిటంటే పెళ్ళాంమీద పెళ్ళాన్ని చేసుకోబోతున్నవాడు రిజిస్టరు పెళ్ళికి ఎంతమాత్రమూ ఒప్పడు. అందుచేత ఆ భయం మనకెంత మాత్రమూ అవసరం లేదు." అన్నాను.

రిజిష్టరు పెళ్ళి గురించి నేను మరికొంత వివరించినమీదట నేను చెప్పింది నిజం కావచ్చునని ఒప్పుకుంది. కాని శంక అన్నది ఒకంతట తీరదు. ఒక దారి మూస్తే, మరో దారిన అది లోపలికి వస్తుంది. ప్రకాశాన్ని చూడరాదా ? వాడి మనస్సు

---

★ మంగలి షాపులో ఒకడు గడ్డం గీయించుకుంటూ : "ఆ గా గు. గాట్లు పెట్టేస్తున్నావ్."

మంగలి : "భయపడకండి. మా షాపులో గాటుకి అయిదు పైసలు ముదరా ఇస్తాం. ఇప్పుడే ఒహాయన ఎనభై పైసలు పుచ్చుకుపోయాడు"

ఇంకా పెళ్ళి గురించి స్థిరం కానేలేదు. ప్రకాశం భార్య ఇంకో అనుమానం లేవదీసింది.

"తాను పెంపు దొచ్చాననీ, తనకు కట్టుకు పోయినంత ఆస్తీ అదీ ఉందం టున్నాడు గదా, అన్నీ అబద్ధా లేనేమో ?"

"మన కిష్టం లేకపోతే మనమా మాట నమ్మనవసరం లేదుగా ? పెంపు డొచ్చిన వాడికి కొంతైనా ఆస్తి వుంటుంది గద ? ఏ ఆస్తీ పాస్తీ లేకుండా ఇంత చదువుకున్నవాడు ఆ ఏక్కుమాలిన కుగ్రామంలో ఎందు కుంటాడూ ? అందులో పట్నం సంబంధం చేసుకున్నాకనైనా అత్తవారి అండన పట్నం చేరాలని గదా వుంటుందీ ? అదంతా అలా వుంచుదాం. అతను తనకు పెద్ద ఆస్తి వున్నదని అబద్ధం చెప్పటంలో ఉద్దేశం ఏముంటుందీ ? కట్నం కోరే వాడైతే తన ఆస్తి పాస్తుల విషయమై అబద్ధ మాడినా అర్థం ఉంటుంది. ఆతను కట్నాలూ, కానుకలూ అడగలేదే ?" అన్నాను.

ప్రకాశం భార్య కొంచెం ఆలోచించి నేనన్నమాటలో పాయింటుందని ఒప్పు కున్నది. ఆవిడమనసు పూర్తిగా కుదట పడిందని చెప్పలేను గాని, కొంతతేలి కన పడ్డ మాట నిజం.

తరవాత ప్రకాశాన్ని కదిలించి, కోటేశ్వర్రావు గురించివాడిఅభిప్రాయం అడిగాను.

"హి ఈజె నైస్ఫెలో. బుద్ధిమం తుడు. సాధువు. ఒక్కాదురలవాటులేదు. అతను క్రిష్టియన్ కాలేజీ స్టూడెంటేట. పట్నమంతా బాగా తెలుసు. కాకపోతే పట్నంలో కాపరం పెట్టమంటే, ఎంత మాత్రం కుదరదంటున్నాడు. నూరెక రాల ఆస్తి. సుక్షేత్రమైన మాగాణీ యాభై ఎకరాలుంటుందిట. డామిట్, ఇవాళ లక్షలు చేస్తుంది." అన్నాడు ప్రకాశం.

"పల్లెటూళ్ళో వుండటం పట్నం వాసం మరిగిన వాళ్ళకి కాస్త కష్ట మేనే. లీల ఏమంటుంది ?" అన్నాను.

"అదేమంటుందీ ? నే నీ విషయం అతనితో అంటే, కావలిస్తే, అక్కడ విసుగెత్తినప్పుడల్లా లీల పట్నం రావచ్చునన్నాడు. ఆరు నెల్లక్కడా, ఆరు నెల్లిక్కడా వుంటే సరిపోదా అన్నాడు."

పోతే, నా అనుమానమే దిగబడింది: దత్త పుత్రుడికి రహస్యంగా పెళ్ళి చేసుకునే దమ్మెలా వచ్చింది ?

## 5

కోటేశ్వర్రావు పల్లెటూరి వాడైనా కూడా ఆధునిక వరుడిలాగే ప్రవర్తిం చాడు. అతను లీల పరిచయం చేసు కున్నాడు. వెకిలి వేషాలేమీ వెయ్య కుండా దాన్ని టాకీస్లలో షాపింగుకూ, సినిమాలకూ తీసుకుపోయాడు. సిని మాలమీదా, సంగీతంమీదా, డాన్సు మీదా లీల అభిప్రాయాలను ప్రమా

ణంగా తీసుకునేవాడు లాగుంది. ఒక సారి మా అందరి ముందరా, "లీల చాలా ఎకాంప్లిష్ట్ గర్ల్. సాధారణంగా అన్ని కళలలో ప్రవేశం వున్న ఆడపిల్ల లుండరు" అన్నాడు.

మగవాడిలా ప్రశంసించటం ఏఆడదానికి బాగుండదు!

లీలకు అతనంటే చాలా ఇష్టం యేర్పడ్డట్టు నాకేకాదు, ప్రకాశానికీ, వాడి భార్యకూ, కొడుకులకూ కూడా అనిపించింది. వాళ్ళకూడా అతను బాగా చదువుకున్న వాడనీ, చాలా విషయాలు తెలిసిన వాడనీ ఇంప్రెసయారు.


పెళ్ళి గడువు పదిహేను రోజులూ అతను ముళ్ళమీద వున్నట్టున్నాడు. పెళ్ళి ఎంత త్వరగా అవుతుందా అని అతను తొందర పడుతున్నట్టు మిగిలిన వాళ్ళ కనిపించిందిగాని, నా మటుకు నేను అతనిమాట నమ్మాను—తాను త్వరగా స్వగ్రామానికి తిరిగి వెళ్ళాలని అతనన్నాడు.

పెళ్ళి ఇంకా అయిదారు రోజులుండనగా ప్రకాశం శుభలేఖలు వేయించాడు. తనవైపు బంధువులకు తానే శుభలేఖలు స్వయంగా పంపుతానని కోటేశ్వర్రావు ఒక డజను మాత్రం తీసుకున్నాడు. వాటిని అతను పంపే వుండాలి పెళ్ళికి మాత్రం ఇతరచోట్ల నుంచి అతని బంధువులెవరూ రాలేదు.

రేపు పెళ్ళి అనగా కోటేశ్వర్రావు తనబంధువు లెవరో పట్నంలోనే చాకలిపేటలో ఉన్నట్టు చెప్పి, వాళ్ళను ఆహ్వానించి వచ్చాడు. వాళ్ళ కుటుంబం మటుకు పెళ్ళికి వచ్చారు.

రిజిస్ట్రారు ఇంటికి వచ్చి పెళ్ళి జరిపించి వెళ్ళాడు, సాక్షి సంతకాలలో నాదికూడా ఉన్నది.

పెళ్ళయిన సాయంకాలమే ప్రకాశం ఆటే ఆర్భాటంలేకుండా రిసెప్షను జరిపి



ఓ వందమందికి భోజనాలు కూడా పెట్టాడు. పెళ్ళికానుకలన్నీ లీలకే వచ్చాయి.

పెళ్ళయిన మర్నాడే కోటేశ్వర్రావు తన ఊరికి బయలుదేరాడు_ఒంటరిగా. "పెళ్ళి చేసుకున్న వాడివి పెళ్ళాన్ని వెంట తీసుకుపోవే" మని ఎవరడుగు తారు. ఎలా అడుగుతారు. వారం పది రోజుల్లో తానే వచ్చి తీసుకుపోతా నన్నాడు. ప్రకాశం మటుకు అతన్ని రెండు రోజులుండి మరీవెళ్ళమన్నాడు. కాని అతను వెళ్ళాలని మహాతొందరలో ఉన్నాడు. అందుచేత వెళ్ళనివ్వక తప్పలేదు.

అతను వెళ్ళినాక నాలుగైదు రోజు లకు లీలకు అతని దగ్గర నుంచి వుత్తరం వచ్చింది. రిజిస్టరు పెళ్ళి చేసుకున్నందుకు అతని బంధువులంతా కోప్పడ్డారుట. అది పెళ్ళేకాదనీ, తాము చూస్తూండగా పీటలమీద కూర్చుని, అగ్నిసాక్షిగా, మంత్ర యుక్తంగా పెళ్ళి చేసుకు తీరాలని పట్టుబట్టు తున్నారుట. పై మాసంలో పెళ్ళి ముహూర్తం కూడా నిశ్చయ మయిందిట. ఈ పీటలమీది పెళ్ళికి లీలను ఒప్పుకోమని బతిమాలుతూ అతను రాశాడు. లీల ఒప్పుకుంటూ మొగుడికి జవాబు రాసేసినాక అతను రాసిన విషయం అందరికీ చెప్పింది.

కోటేశ్వర్రావు లీలకు చేసిన ఈ సూచనలో నేను తప్ప మిగతా వాళ్ళెవరూ ఆసక్తి కనబరచలేదు. ప్రకాశం చీదరించుకుని, "అసలు పెళ్ళేమో అయేపోయింది. కావలిస్తే నీ మెళ్ళో మూడు మంగళసూత్రాలు కట్టుకోమను. నాకు మాత్రం ఈ మంత్రాల పెళ్ళితో ఎలాటి సంబంధమూ లేదు" అని కూతురికి చెప్పే శాడు.

ప్రకాశం భార్య నన్ను సలహా అడి గింది. "ఇలా పెళ్ళిమీద పెళ్ళి చేసు కోవటంలో తిరుగుదేమీ ఉండదుకద?"

ఉండదనీ, కొందరు విదేశాలలో కూడా ఇలా రెండురకాల పెళ్ళి చేసు కుంటారనీ, అందువల్ల పెళ్ళిముడి మరింత గట్టిగానే ఉంటుందిగాని, నష్ట మేమీ ఉండదనీ ఆవిడకు నచ్చ చెప్పాను.

లీలతో మాత్రం, "మీ ఆయన ఏ కారణం చేతనో ఇక్కడ జరిగిన పెళ్ళి గురించి వాళ్ళకు చెప్పకుండా దాచి నట్టుంది. నీకా పల్లెటూళ్ళో జరగ బోయేదే పెళ్ళి అని వాళ్ళు బహుశా అనుకుంటారు. ఇది నిజమైతే నా కొక కార్డు ముక్క మటుకు రాయి." అన్నాను.

లీల సరేనన్నది.

రెండో పెళ్ళి ఇంకా నాలుగు రోజు లుందనగా కోటేశ్వర్రావు దిగాడు. అతనూ లీల చాలాసేపు గుసగుసలాడు కున్నారు. తరవాత అతను మర్నాడే లీలను తన వెంట తీసుకు పోతున్నట్టు చెప్పి, లీలవెంట ఎవరొస్తారని అడి గాడు.

అల్లుడు వచ్చినప్పటినుంచి చిట చిట లాడుతూ, కుత కుత లాడుతూ వున్న

ప్రకాశం. "ఎవరైనా ఒకరు రావలసిన అవసరం వుందా ఏమిటి?" అని అడిగాడు.

మామగారి పరాకుచూసి కోటేశ్వరావు ముడుచుకుపోవటం నేను కళ్ళారా మొదటిసారి చూశాను.

"కన్యాదానానికి ఎవరన్నా పీటల మీద—" అని అతను జంకుతూ ప్రారంభించేసరికి ప్రకాశం మరింత మండిపడి, "అనాథపిల్ల అని వాళ్ళతో చెప్పెయ్యి! దారిలో దొరికిందను!" అన్నాడు.

లీల శోకం లంకించుకుంది.

"ఏమిటండీ మీరు మరీనూ.... పిల్ల వెంట నేనొస్తాన్లే, నాయనా!" అన్నది ప్రకాశం భార్య.

"మామగారు కూడా వస్తే—" అని మళ్ళీ గొణిగాడు కోటేశ్వరావు.

ప్రకాశం ఇక కోపం పెంచుకునేటందుకు ఓపికలేక శాంతం అవలంబిస్తూ, "చూడు, కోటేశ్వరావ్. నేను సీరియస్ మనిషిని. మన దేశంలో జీవితంతో ఆటలాడుకునే వాళ్ళున్నారని నాకు తెలుసు కాని నాకు ఆడుకునే తీరికలేదు. నా ఉద్దేశంలో ఈ మంత్రాల పెళ్ళి వుత్త బొమ్మల పెళ్ళి, ఆటవికుల సంబరం! తెలిసింది గాదూ! అలాటి నాన్సెన్స్‌తో నేను పుటప్ చెయ్యలేను — చెయ్యను. అదీ గాక.... నువు మీ వాళ్ళ దగ్గిర ఏం నాటక మాడుతున్నావో నాకు తెలీదు. ఒకరకం పెళ్ళి అయిపోయిందని నువు వాళ్ళకు చెప్పి వుంటే మళ్ళీ కన్యాదానం సమస్యరాదు. నువు మీ వాళ్ళ దగ్గిర నీ యిష్టం వచ్చిన నాటక మాడుకో. నా అభ్యంతరం ఉండదు. కాని నేను వచ్చానంటే వున్నమాట బయట పడుతుంది. నిజం చెప్పటానికి వస్తే నేను కంట్రోలు తప్పిన స్లాట్ మెషీనును. తెలిసిందిగాదూ?" అన్నాడు.

కోటేశ్వరావు తల వంచుకుని మౌనంగా మామగారి వుపన్యాసమంతా విని, చివరకు తల ఎత్తి నా కేసి చూశాడు. అతని కళ్ళలో. ప్రశ్న నాకు సరిగా అర్థం కాలేదు. అతనా క్షణంలో నన్ను వెయ్యగల ప్రశ్న లన్నిటికీ నాది ఒకటే సమాధానం—తల అడ్డంగా తిప్పాను.

లీల సన్నగా ఏడుస్తూనే వుంది.

"పోనివ్వండి. మా వెంట ఎవరూ రావద్దు. మీరన్నట్టు కన్యాదానం అన్నది అంత ముఖ్యమేమీ కాదు. ఆ సమయానికి ఎవరు పీటలమీద కూర్చున్నా సరిపోతుంది." అన్నాడు కోటేశ్వరావు ఎంతో శాంతంగా.

"అదేమిటి, నాయనా? పిల్లను ఒంటరిగా కాపరానికి పంపిస్తామా? నేను వస్తాను. మీ వాళ్ళు పెళ్ళికైనా వచ్చారు కారు. అయినా ఎలా వస్తార్లే? వాళ్ళలెక్కన ఇదసలు పెళ్ళే కాదుగా? ఇప్పుడంటే కొత్త పద్ధతులొచ్చి పడ్డాయామె. నా చిన్నతనంలో పెళ్ళిళ్ళంటే ఎలా ఉండేవి! పెళ్ళికూతుర్ని చేసి కల్యాణం బొట్టు పెడితే ఎంత కునిష్టిది కూడా కళకళ్లాడుతూ ఎంతో యిదిగా

# సొగసైన కురులు



## రీటా

ఒకరి శిరోజ సౌందర్యంచూచి మరొకరు ఇక ఎంతమాత్రం అసూయపడవలసిన అవసరం లేదు. రీటా వాడి మీ కురుల సౌభాగ్యాన్ని వృద్ధి చేసుకోండి.



వీటో కంపెనీ,
మద్రాసు 1

R-20 TG


ఉండేది. స్నాతకంకాగానే కాశీయాత్రా, ఎదుర్కోలూ, ముహూర్తం అయాక తలంబ్రాలూ, రోజూ మేజువాణీలూ, పెళ్ళిపాటలూ, బెండ్లాటా, పల్లకీ ఊరేగింపులూ, అలకలు తీర్చటమూ, బూజం దంతీ, నాగవల్లి, పానుపు, దండాదింపూ, అప్పగింతలూ—ఎన్ని వేడుకలు! ఎంతసరదా!" అన్నది లీల తల్లి.

"అవునవును! ఎన్ని పోట్లాటలు! ఎన్ని దెప్పులు! ఎన్ని సాధింపులు! ఎంత దుబారా ఖర్చు!" అన్నాడు ప్రకాశం.

ఆ రాత్రి నేను ప్రకాశం వాళ్ళింట్లోనే భోజనం చేశాను. భోజనం అయాక నేను మా యింటికి బయలుదేరుతుంటే బయటిదాకా సాగనంపటానికి వచ్చినట్టుగా కోటేశ్వరరావు వెంట వచ్చాడు. అతను నాకో ఏదో చెప్పదలిచాడని అర్థం చేసుకున్నాను. దారిలోనే అతను ఉపోద్ఘాతం లేకుండా మొదలు పెట్టాడు.

"నేను చేసినపని చెడ్డదని మీరంటే పడతాను, బాబుగారూ. చేసినపాపం చెబితే పోతుందనేది కూడా నిజంకాదు. కాని లీల మంచికోరే వారిలో ఎవరికో ఒకరికి కొన్ని విషయాలు చెప్పటం నా డ్యూటీ. మామగారు వినేస్థితిలో లేరు. అత్తగారు కొత్తిగా అమాయకురాలు. నాకు మీరే కనబడ్డారు." అని అతను ప్రారంభించాడు.

(ఇంకా వుంది)

# మారిన జీవితం

## కొడవటిగంటి కుటుంబరావు

(గత సంచిక తరువాయి)

"నువు చెప్పబోయే విషయం కొంత వరకు నాకు తెలుసనే అనుకుంటాను. అయినా చెప్పదలచుకున్నదేమిటో నువు చెప్పు" అన్నాను.

"నన్ను పదిహేడోఏట దత్తుచేసుకున్నారు. నేను బస్తీలో పెరిగినవాణ్ణే. ఆస్తికోసం మావాళ్ళు నన్ను పరమ పల్లెటూరిచ్చారు. ఇవ్వటమనేది తప్పుమాట కాదనుకుంటా. నన్ను పెంచుకున్న వాళ్ళకు ఆరుగు రాడపిల్లలు. ఇద్దరు మగపిల్లలు పుట్టారుగాని దక్కలేదు. ఒక పిల్లవాడు పుట్టిన నెలకు పోయాడు. రెండోవాడు పుట్టిన గంటలోనే పోయాడు. ఆ దంపతులకు పుట్టే మగపిల్లలు దక్కక పోవటానికి శాస్త్రీయమైన కారణా లుంటాయను కోండి. కాని మావాళ్ల రెండు శతాబ్దాలు వెనక ఉండటంచేత, వాళ్ళకు క్రిందటి జన్మలో చేసిన పాపం ఏదో కట్టికుడుపుతున్నదని నమ్మకం ఉండేది. వాళ్ళ మూఢత్వం ఆధారంగా మాబంధువొకాయన నన్ను వాళ్ళకు దత్తు ఇప్పించాడు" అన్నాడు కోటీశ్వర్రావు.

"అదెట్లా?" అన్నాను.

"క్రిందటి జన్మలో వాళ్ళు ఒకపేద దంపతుల కున్న ఒక్క కొడుకుమా విషంపెట్టి చంపారనీ. అందుచేతనే ఈ జన్మలో వాళ్ళకుమగపిల్లలు దక్కటం లేదనీ, వాళ్ళు చంపిన పిల్లవాణ్ణీ ఈ జన్మలో నేనే ననీ ఒక దైవజ్ఞుడిచేత యుక్తిగా చెప్పించి, వాళ్ళను నమ్మించాడు."

"వాళ్ళు అంత తేలిగ్గా నమ్మారా?"

"మా వాళ్ళసంగతి మీకు తెలీదు... నేను పెంపుడొచ్చేనాటికి నాకొక పెళ్లాం రెడీగాఉంది. దానికప్పుడు ఏడేళ్ళు. ఎనిమిదేళ్ళు ఉంటాయి. మరి రెండేళ్లాగి దాన్ని నాకు పెళ్ళిచేశారు."

"బాల్య వివాహమే?"

"ఖచ్చితంగా. పెద్దమనిషి అయిన మూడు నెల్లకు గర్భాధానం చేసేశారు. ఆ తరవాత ఏడాదికల్లా అదిపోయింది. బాబుగారూ, పోయిన భార్యనుగురించి చెబితే మీరు నమ్మలేరు. నరరూప పశువు. చదువూ సంధ్యా లేదు. ప్రపంచ జ్ఞానం లేదు. పెంపుడు రావటమంటే అటువంటి పెళ్ళాన్ని కట్టుకొనటమని నేను కలలోకూడా అనుకోలేదు. అనరాదుగాని, అది చచ్చిపోతే నాకు విమోచనం అయినట్టు అనిపించింది. బ్రహ్మచారిగా బతకటమైనా సుఖమే

అనిపించింది. కాని నా విడుదల తాత్కాలికమే అయింది. పోయిన నా భార్య కాక చెల్లెలు ఎదిగి వస్తున్నది. దాని కిప్పుడు ఏడేళ్ళుంటాయి. దాన్ని నాకిచ్చే విషయం ఆలోచనలు ప్రారంభమయాయి. నాకు దడ పుట్టుకొచ్చింది. నన్ను ఈ నరకంలో దింపిన బంధువు బదికే ఉన్నాడు. చక్రం అడ్డెయ్యమని ఆయన కాళ్ళు పట్టుకున్నాను. ఆయన మరొక జ్యోతిష్కుణ్ణి పంపకం చేశాడు. ఆజ్యోతిష్కుడొక చక్రంవేసి, అది నా చక్రమనీ, అందులో కుజదోషం బలంగా ఉన్నదనీ, ఎంత మందిని చేసుకున్నా చచ్చిపోతారనీ మా వాళ్ళకు చెప్పాడు. మా అత్తవారు తారెత్తిపోయి నా మరదలును నా కివ్వమనేశారు. మావాళ్ళకేం చెయ్యాలో తెలియలేదు. అప్పుడు నేనొక దొంగవేషం వేశాను. నాడీ గ్రంధంలో నా జాతకం చూపించుకుని అందులో నాకు రాసిపెట్టి ఉన్న భార్య పేరు తెలుసుకుని, సంబంధం మాట్లాడతానన్నాను. నాడీ గ్రంధం అద్భుతాలను గురించి వాళ్ళకు నేను విన్నవీ, విననివీకూడా చెప్పాను. వాళ్ళు సరేనన్నారు. అప్పటికే నాకు లీల సంగతి తెలిసిఉంది. నేను బయలుదేరి వచ్చి మామగారితో మాట్లాడాను. ఇంటికివెళ్ళి మా వాళ్ళతో నాడీ గ్రంధంలో అంతా వచ్చేసిందనీ, అందులోనూ అసలు తల్లిదండ్రుల పేర్లూ, పెంచుకున్నవాళ్ళ పేర్లూ, పోయిన నా భార్యపేరూ, కాబోయే నా భార్యపేరు కూడా వచ్చిందని చెప్పాను. లీల అనే పేరుగల పెళ్ళిగాని పిల్లకోసం పత్రికల్లో ప్రకటన వేశానని కూడా చెప్పాను. మామగారు నాకు రాసిన ఉత్తరాలు ఆ ప్రకటనలకు వచ్చిన జవాబులని బొంకాను. పెళ్ళికి వచ్చేటప్పుడు మా వాళ్ళతో, నేను చూడవలసిన పిల్లలు ముగ్గురున్నారనీ, వాళ్ళు వేరు వేరు ఊళ్ళలో ఉన్నారనీ, వాళ్ళను చూసి, వాళ్ళలో కుజదోషం ఎవతెకున్నదో జాతకాలు చూపించి, అటువంటి సంబంధమే కుదుర్చుకొస్తాననీ, ఇదంతా రెండు మూడు వారాలు పట్టవచ్చుననీ చెప్పి వచ్చేశాను. అప్పుడే మా పెళ్ళి అయిందనుకోండి. నేను తిరిగి వెళ్ళి మా వాళ్ళతో సంబంధం కుదిరిందని చెప్పానుగాని పెళ్ళి అయిందని చెప్పలేదు. పిల్ల దిక్కులేనిదనీ ఎవరో పెంచుతున్నారనీ అన్నాను. ఎందుకు చెప్పానో మీపేరు చెప్పాను. అందుచేత ఇప్పుడు మా వెంట తీసుకుపోతే మిమ్మల్ని తీసుకుపోవాలి. అత్తగారేమో వస్తామంటున్నారు...."

అతను మాట్లాడటం మానేశాక చాలాసేపు నేనేమీ అనలేదు. అతని కథ నాకు చాలా జుగుప్సాకరంగా తోచింది. రేచుక్క, పగటి చుక్కల కథలోకూడా ఏదో ఒక ఉదాత్తమైన అంశం ఉంది. కోటీశ్వర్రావు కథలో మచ్చుకైనా అది లేదు, అతని మీద తీర్పు చెప్పటం నా ఉద్దేశం కాదు. అతనికన్న జుగుప్సా

పెద్దకథ

తరమైన వ్యక్తులు రాజకీయ రంగంలో ఉన్నారని నాకు తెలుసు.

"జరిగిన సంగతి మీకు దాచకుండా చెప్పేశాను. లీల దిక్కులేని మనిషని మా వాళ్ళతో చెప్పమని మామగా రన్నప్పుడు నాకు పచ్చే భయంవేసింది— మీ కందరికీ నా నాటకమంతా తెలిసిపోయిందేమోనని. లీలతో అంతా చెప్పాను. నా విషయాలేవీ మీకు తెలియదన్నది లీల. నే నాడిన నాటకాన్నిగురించి తను అర్థం చేసుకున్నది. మీవంటి పెద్దలుకూడా అర్థంచేసుకుంటే నాకు ఇంకొంచెం తృప్తిగా ఉంటుంది." అన్నాడు కోటీశ్వర్రావు.

"లీల ఏమర్థం చేసుకున్నదో నాకు తెలీదు. నన్నడిగితే దానికింకా ఆవగింజలో అరభాగం కూడా అర్థం కాలేదంటాను. నామాటంటావా? నేను మొదటి నుంచీ అర్థం చేసుకుంటూనే ఉన్నాను. అంతో యింతో. అర్థం చేసుకోవటమంటే ఆమోదించటం కాదు" అన్నాను.

నాకు మటుకు అతనిమీద చాలా కోపంగా ఉంది. ఆ కోపాన్ని అణచిపెట్టుకుని మాట్లాడాను.

"అంటే మీరు నన్ను క్షమించలేదన్నమాట" అన్నాడతను.

"నీ జీవితాన్ని చక్కబరుచుకునేటందుకు నువ్వేం చేసుకున్నా నా కొకటే. నువుచేసిన పనుల మంచి ఫలితాలన్నీ నీకు దక్కాయి. మీవాళ్ళ కళ్ళలో దుమ్ముకొట్టి, నీకక్కర్లేనిపెళ్ళి తప్పించుకున్నావు. కావలసిన పిల్లను చేసుకున్నావు. నువుచేసిన పనికి అనుభవించ బోతున్న మనిషి లీల. ఆ అనుభవం ఇంకా ఆరంభం కాలేదు. ముందుగానే నువు క్షమాపణ కోరడంలో అర్థంలేదు. క్షమిస్తే నిన్ను లీలే క్షమించాలి. తాను ఊబిలో దిగబడ్డానని తెలుసుకున్నాక అది క్షమిస్తుందను కోను....చాలా పొద్దుపోయినట్టుంది. వస్తా. ఇక నువు తిరిగిపో. గుడ్‌నైట్" అని నేనింటికి వెళ్ళిపోయాను.

## 6

ఎవరూ తోడులేకుండానే లీల తన భర్తవెంట అత్తవారూరు వెళ్ళాక దాదాపు నెల రోజులకు నాకో ఉత్తరం వచ్చింది. ఆ రోజే లీల వాళ్ళ అమ్మ కూడా రాసిందిట. రెండు ఉత్తరాలలోనూ అత్తవారింటి వివరాలు ఇంచుమించు సమంగానే రాసింది. నాకు తన భర్త విషయం హెచ్చు వివరాలు రాసింది. రెండు ఉత్తరాలలోనూ కలిపి చెప్పుకోదగిన విశేషాలేవంటే—

కానూరు అగ్రహారం పరమ "చచ్చు" పల్లెటూరు. రైలుమీదా, బస్సుమీదా, కాలినడకనా (లేక రెండెడ్ల బండిలో) వెళితేగాని ఆ ఊరు రాదు.

ఊరి కంతకీ లీల అత్తవారిదే ఘరానా కుటుంబం. ఆ కుటుంబానికి హిట్లరులాంటిది లీల అత్తగారు కామేశ్వరమ్మ. ఆవిడకు చదువురాదు. కాని బంధుబలగాన్ని అవసరం వచ్చినప్పుడు వాడుకుంటూ, అందర్నీ తన గుప్పిట్లో ఉంచుకున్నది. ఆవిడ వానను ఎండ

అంటే, వాళ్ళూ అనేస్తారు. ఆవిడ పెద్ద వ్యవహర్తగా ఊళ్ళో కొందరి దగ్గర చలామణీ అవుతున్నది. ఊళ్ళో ఆవిడకు "శత్రువర్గం" లేకపోలేదు. కాని వాళ్ళింకా ఆవిడపైన చెప్పుకో దగిన "విజయం" సాధించినట్టు కనబడదు.

ఆవిడ కూతుళ్ళలో ముగ్గురు వితంతువులు. అందులో ఒకావిడకి ఇద్దరు పిల్లలున్నారు. మిగిలిన ఇద్దరికీ పిల్లలు లేరు. పైపెచ్చు బాలవితంతువులు. అందరూ తల్లిని ప్రతిధ్వనిస్తారు.

ఈ ఆడ ముఖాలు ఒక్కరికూడా చదువురాదు. ప్రపంచ జ్ఞానం లేదు. వాళ్ళ ప్రపంచం గురించి వాళ్ళకు మంచి జ్ఞానమే ఉన్నదిగాని, అది బొత్తిగా చిన్న ప్రపంచం .... (నేనెప్పుడో అన్నానుట, కంకరరోడ్డు పడితే చాలు, పూర్తిగా మారిపోయే గ్రామాలు దేశంలో ఉన్నాయని. ఈ కానూరు అలాంటిదేననీ, ఆ తరవాత తమ అత్తగారూ, ఆడబిడ్డలూ ఎండిన చెరువులో చేపల్లాగా అయిపోతారనీ లీల నాకు రాసింది.)

లీల భర్త కోటీశ్వర్రావు సాలీడు గూట్లో చిక్కిన ఈగలాగా ఉన్నాట్ట. అందరాడవాళ్ళూ అతన్ని భయపెడతారుట. అతను తన ఇష్ట ప్రకారం ఏం చెయ్యదలచినా వాళ్ళను విధిగా మోసం చెయ్యవలిసిందేట!

లీలను చూస్తూనే అత్తవారింటి వాళ్ళంతా "ఎబ్బే! పిల్లల తల్లల్లే ఉంది!" అన్నారుట. "నీ కిదే మొదటి పెళ్ళా?" అని బాలవితంతువాడబిడ్డ అడిగిందిట లీలని.

లీల "రెండో" పెళ్ళి గుళ్ళో పెళ్ళిలాగా జరిగిందిట. లీల అత్తగారు "ఇదేం పెళ్ళి? నా బొందపెళ్ళి!" అని వెయ్యిసార్లు అన్నదిట. ఒక్క ముచ్చటా లేదన్నదిట.

పెళ్ళయిననాడే గర్భాధానం కూడా ఏర్పాటు చేశారుట. ఆ రోజు ఆడవాళ్ళ ప్రవర్తనా, సంభాషణా పరమ అసహ్యంగా ఉన్నట్టు లీల తల్లికి రాసింది.

పెళ్ళి అయిన మర్నాడే ఆడవాళ్ళు "నీకు నెల ఎప్పుడు?" అని అడిగి చెప్పేనదాకా వదిలిపెట్టలేదుట. లీలకు తారీకులు తెలుసుగాని తిధులు తెలీవు. వాళ్ళకు తిధులుతప్ప తారీకులు తెలీవు. చివరకు కోటేశ్వర్రావు సహాయంతో వాళ్ళు శుద్ధ పాడ్యమి ప్రాంతాల లీల బయట ఉంటుందని తేల్చారుట.

తన ఆడబిడ్డలు చాపా, చెంబూ తీసుకుని ఎడంగా కూర్చోవటం చూడగానే లీలకు కంపరం ఎత్తుకొచ్చిందిట — తానుకూడా అలాగే కూర్చోవాలని. మొగుణ్ణడిగితే, "ముట్టు మైల ఇంట్లో కలపటమే? చంపెయ్యరూ?" అన్నాట్ట.

బయట కూర్చోవటంతో పోతే బాగుండిపోనేమో, పేడతో తిన్నచోట అలకటమూ, ముట్టు శుద్ధికి ఆవు పంచితం కలిపిన నీళ్ళతో స్నానం చెయ్యటమూ అన్నీ రెగ్యులేషన్లలో ఉన్నట్టు తెలిసి లీల బేజారైపోయింది.

తనవాళ్ళు వింటుండగా కోటీశ్వ

రావు పెళ్ళాన్ని పేరుపెట్టి పిలవటానికి లేదు. తప్పనిసరిగా అయితేనే మాట్లాడాలి. అదైనా ఏ గోడకో చెప్పినట్టు చెప్పాలి. రాత్రి అందరూ పడుకుని, ఇల్లుబాగా మాటుమణిగే దాకా లీలపడక గదిలో మొగుడు దగ్గిరికి పోరాదు. అందుకు వీలుగా ఉండేటట్టు ఇంటి చాకిరిలో ఆఖరు పనులు లీలకు చెబుతారుట.


మొత్తంమీద సంసార సుఖం చాలా పరిమితంగా ఉండాలిట. ఆ ఇంట్లో పండగలూ, పర్వాలూ ఏకాదశీ అమావాస్యలూ వర్జ్య దినాలు!

లీలకు ఆ మనుషులూ, వాళ్ళ తిండీ, వాళ్ళ మాటల ధోరణీ, వాళ్ళ నిత్య కృత్యాలూ, బట్టలూ సహవాసమూ పరమ మోటుగా కనబడ్డాయి. ఆ భావాన్ని ఎంత దాచుకుందామన్నా దాగ లేదు లాగుంది. అత్తగారు, "ఏం మరీ నాజూకులు పోతున్నావు? దిక్కూ మొక్కూ లేని నీకే ఇంత గీర్వాణం ఉంటే మాకెంతఉండాలి?" అన్నదిట.

మొదట లీలకు అత్తగారినిచూసి, ఆడబిడ్డలను చూసి భయపడాలని కూడా తట్టలేమట. వాళ్ళేదన్నా అంటే, ఇటువంటి మనుషులు కూడా ప్రపంచంలో ఉంటారా అన్నట్టు ఆశ్చర్యంగా చూసేదిట. కాని త్వరలోనే అది వాళ్ళంటే భయపడటం నేర్చుకున్నదిట.

లీలకు కోటీశ్వర్రావు ఒక పాత్ర


లివర్ వ్యాధి ప్రమాదమునుండి
ఇతనిని కాపాడండి
ఇందుకు తగిన చికిత్స




బిడ్డల యొక్క లివర్ మరియు స్ప్లీన్
వ్యాధులకు ప్రఖ్యాత ఔషధము.
జమ్మి వెంకటరమణయ్య & సన్స్, మద్రాస్-4.
బ్రాంచీలు: బెంగుళూరు-2; కుంభకోణం;
తిరుచిరాపల్లి-2; హైదరాబాద్-20

నిర్దేశించాడు. దాన్ని అభినయించటానికి లీల ఏపాటి శ్రమ తీసుకున్నదీ చెప్పటం కష్టం, కాని అడుగడుగునా తప్పటడుగు వేసినమాట నిజం. లీల పుట్టింటినుంచి తెచ్చుకున్న చీరెల దగ్గిరే కష్టాలారంభమయాయి.

"అబ్బో, ఏం నాజూకు చీరెలు. మానాడు మేం కూడా ఎరగమే!" అన్నది ఒక వితంతు వాడబడుచు.

"భోగంవాళ్ళు కట్టుకునే చీరలే!... ఇదేందబ్బా?....పౌడరా?....ఏంచేస్తారీ పౌడరూ?.... మొహానికి పూసుకుంటారా?...నాటకాల్లో వాళ్ళల్లేనా?.. నువు మొహానికీ పౌగడురు పూసుకుంటావా? ఛీ! ఛీ!" అన్నది బాల వితంతువు.

లీలకు వాళ్ళు ఒక్కొక్క పనే నేర్పారు. పేడతో లంకంత ఇల్లు అలకటమూ, వెన్న తియ్యటమూ, పాలు తియ్యటమూ, గొడ్లకు మేత వెయ్యటమూ, పాలెగాళ్ళ పనులు చెప్పటమూ. అన్నీ వాళ్ళుచేసే పనులే. లీల చెయ్యనని ఎట్లా అంటుందీ? ఆఖరుకు మడి గట్టుకుని వంట చెయ్యటం కూడా నేర్పారు.

మొదట్లో లీల తీరిక చూసుకుని పుస్తకాలు - తనతో తెచ్చుకున్నవి — చదవాలని ప్రయత్నించింది. ముక్కు-గోక్కుంటే కోతులకెంత రోషమో పుస్తకం చేతపట్టుకున్న ఆడదాన్ని చూస్తే లీల అత్తవారింటి వాళ్ళకంత రోషం. లీల పుస్తకాలను అత్తగారు పొయిలో పెట్టేసింది.

"ఎలెక్ట్రిక్ దీపంచూసి ఒక యుగమైనట్టుంది. ఇప్పటికికూడా చీకటి పడుతున్నదంటే చెప్పరాని గుబులు పుట్టుకొస్తుంది. లంకంత ఇల్లు, కిరసనాయిలు బుడ్డి దీపాల వెలుతురులో భయం భయంగా ఉంటుంది....నిన్న నట్టింట ఇంత పెద్ద మండ్రగబ్బను చంపారు. నేను వచ్చేముందరే వాములదొడ్లో తాచుపామును చంపారుట. నేను మసక వెలుతురులో అక్కడికి పోయి రోజూ పాలు పితకాలి," అని నాకు రాసింది.

అంధకారంలో ఆశారేఖలాగా లీలకు భర్త ఒకడు కనిపించాట్ట. అతను ఆమె కష్టాలన్నిటినీ అర్థంచేసుకున్నాట్ట. మిగిలిన జంతువుల మధ్య లీలకు తను ఒక చిన్న దేవుడల్లే కనబడితే కనబడ్డాడేమో. కాని తనను ఆ నరకంలో ప్రవేశపెట్టినది ఆ దేవుడేనని గ్రహించిననాడు లీలకు అతనుఎలా కనిపిస్తాడా అని నేనాశ్చర్య పడ్డాను.

తరవాత లీల వాళ్ళమ్మకు మరొక ఉత్తరం రాసింది.

"ఈ జీవితం ఎలా గడపటం?

---

★ అప్పారావు : "చాలా ఇబ్బందుల్లో వున్నాను. అర్జంటుగా యాభై రూపాయలు కావాలి. ఎవర్ని అడగాలో తోచడం లేదు."

సుబ్బారావు : "రక్షించావ్. నన్ను అడగాలని తోచిందేమోనని హడిలిపోయాను."

ఎంతకాలం? ఏదో పీడకలలాగా ఇది కొంత కాలానికి అయిపోతుందన్నట్టుగా ఇన్నాళ్ళూ ఉన్నాను. ఇది ఎప్పటికీ ఇంతేనని అకస్మాత్తుగా తెలిసి చెప్పరాని భయం కలిగింది.... పెళ్ళయి మూడు నెల్లయినా ఇంకా కడుపూ గడ్డలూ లేదుట. నన్ను గొడ్డుమోతునంటున్నారు! వీళ్ళు మనుషులు కాదు. పశువులు— అంతకన్న కూడా హీనం. 'అయ్యో, పాపం' అన్నమాటలు వీళ్ళ నోట నేనింతవరకు వినలేదు. నేను తిండికి మొహంవాచి, దిక్కులేని దాన్నిగా పెరిగాననీ. వీళ్ళ ఇంటి తిండి వంట బట్టి నాకు పొగరెక్కు తున్నదనీ అంటున్నారు. నేను మన ఇంట ఎట్లా పెరిగానో తెలిస్తే వీళ్ళేమంటారో! నాకు ఎప్పుడు కల వచ్చినా మనఇంటో ఉన్నట్టే వస్తుంది. ఆకలలే నిజంగానూ, మేలుకుని ఉన్నప్పుడు చూసేదంతా కల అనీ అనిపిస్తుంది. మనఇల్లు కలలో వచ్చినప్పుడు, నేనెంత పిచ్చిదాన్ని? నా జీవితం మారిందని ఎందుకు దిగులు పడుతున్నాను. ఏమీ మారలేదు. ఎప్పటి లాగే ఉంది— అనుకుంటాను ఏ మహా పాపంచేసి నే నీ నరకం అనుభవిస్తు న్నానో తెలీకుండా ఉంది.... ఈవిషయా లన్నీ నాన్నకు చెప్పి ఆయనను బాధించకు...."

కాని కూతురి ఉత్తరాలను ప్రకాశం చూడకుండా ఎట్లా ఉంటాడు? వాడు నన్ను సలహా అడిగాడు. లీల పరిస్థితి ఏమీ బాగాలేదు. ఏం చేస్తే బాగుం టుంది? ఏదో ఒకటి చేసితీరాలి!

"ఏం చెయ్యాలన్నది తేల్చుకోవా లంటే ముందు కొన్ని ప్రశ్నలకు సమాధానం చెప్పుకోవాలి. జరిగినది ఎలా జరిగింది? దానికెవరు బాధ్యులు? అది తేల్చుకునేదాకా ఏం చెయ్యాలో తేలదు" అన్నాను.

"అతి తెలివిగా మాట్లాడకు," అన్నాడు ప్రకాశం.

"ఇందులో అతి తెలివేమీలేదు. ఆడపిల్లై పుట్టినందుకు లీల అనుభ విస్తున్నదనుకునే పక్షంలో లీలను మగ వాడుగా మార్చటం మినహాగా పరి ష్కారం లేదు. నువ్వూ, నేనూ అలా అంటామని కాదు — మాటవరసకు చెప్పాను. మనం ఆడవాళ్ళనుఉద్ధ రించే వాళ్ళం కనక, ఆడజన్మ ఎత్తిన కారణంచేత అగచాట్లు పడుతున్నదంటే ఒప్పుకోలేం. అందుచేత లీల కష్టాలకు మరో కారణం ఏదో ఉండాలి"

"నువు ఈ పూట మరీ పైత్యాన పడి ఉన్నావు" అంటూ ప్రకాశం లేచి వెళ్ళిపోయాడు. వాడు ఆరోజే అల్లుడికి రాంబాణంలాటి ఉత్తరం ఒకటి రాసి పడేశాట్ట. దాని తాత్పర్యమేమంటే: "లీల మీ యింట కుక్కకన్న అన్యాయ మైన బతుకు బతుకున్నదిట. దాన్ని మనిషిలాగా బతకనివ్వలేని పక్షంలో తీసుకువచ్చి ఇక్కడ దిగవిడు."

ఈ ఉత్తరానికి కోటీశ్వరరావు దగ్గిర్నుంచి ఏ సమాధానమూ రాలేదు గాని, పదిరోజుల లోపుగా లీల దగ్గిర నుంచే తల్లికాక ఉత్తరం వచ్చింది. తనతండ్రి తనభర్తకు అటువంటి ఉత్త రం రాసి ఉండగూడదన్నది. "తెచ్చి

ఇంట్లో ఉంచుకోవటానికేనా పెళ్ళి చేశారు? ఆ ఉత్తరం చూసి ఆయన చాలా బాధపడ్డారు. కావలిస్తే నన్ను పుట్టింట ఇష్టంవచ్చినంత కాలం ఉండమని, తనవాళ్ళతో ఏదో ఒక బొంకు బొంకుతాననీ అన్నారు. నేను పుట్టింటికి వెళ్ళాలని ఉన్నదని ఒప్పుకోలేదు. మనిషి అన్నాక చాలా కోరికలు తల్లో పుడతాయి. వాటన్నిటినీ చేసేస్తామా? నాకు పట్నంలో వచ్చి వాలాలని ఉన్నదనే అనుకున్నా. మొగుడికి విడాకులిచ్చేసి లేచి వచ్చెయ్యగలనా?...." ఈ ధోరణిలో రాసింది లీల.

తెమలని సమస్యలతో సతమతమయ్యే మన సత్త్వం ప్రకాశంలో ఏ కోశానా లేదు. వాడు లీల ఉత్తరం చూసి, "దానికి లేని దుగ్ధ నాకా? అదేదో కష్టపడిపోతున్నదంటే చాతనయినంతలో సుఖపెడదామని ఆ ఉత్తరం రాశాను. లేకపోతే సంసారం తెంచేసుకుని దాన్ని ఎందుకు రమ్మంటానూ?" అన్నాడు.

"అన్నీ. దాని సుఖం గోరే చేశారు. మన కోరికలు దాని కెందునా పనికిరాలేదు. దాని ప్రారబ్ధం" అన్నది ప్రకాశం భార్య.

## 7

తరవాత ఆరేడు నెలలపాటు లీల నుంచి నాకుగాని, వాళ్ళ అమ్మకుగాని ఉత్తరం ముక్క లేదు!

ఆ తరువాత కోటేశ్వరరావు నా కొక ఉత్తరం రాశాడు. లీలకు నెల తప్పిందిట. అది ఇప్పుడు వెనకటి కన్న చాలా సుఖంగా ఉంటున్నదిట. పై మాసం పదో తారీక్కి తమ వాళ్ళంతా తిరుపతి పోదామనుకుంటున్నారుట.

ఆ ఉత్తరం చూసిన మీదట నేనొక చిన్న నాటకం ఆడాలని ప్లాను వేశాను. నా స్నేహితుడు కొండా రెడ్డికి పుష్పక విమానంలాటి కారున్నది. లీలా వాళ్లు తిరుపతి చేరే రోజుకు రెడ్డిని తిరుపతి తీసుకు పోవాలని ప్రయత్నించాను. పదో తారీకు ప్రాంతాల తనకు ఇతర ఎంగేజిమెంట్లేవో ఉన్నాయన్నాడు.

"నీ మీద ప్రేమకొద్దీ అడగటం లేదోయ్. నీ కారు కోసం_" అన్నాను.

"కారు కావాలిస్తే పట్టుకుపో. వేలాయుధన్ ఇదియోపియా డెలిగేషన్‌లో పోతూ తన కారు నాదగ్గిరే ఉంచాడు" అన్నాడు రెడ్డి.

ప్లాను సగం పూర్తి అయింది. ప్రకాశం కుటుంబాన్ని ప్రయాణం కట్టించడమే తరువాయి.

ప్రకాశం మొరాయించాడు. దేవుడి మీద లెక్చరు ప్రారంభించాడు.

"నేను మాత్రం దేవుణ్ణి చూడబోతున్నానుట్రా? సీనరీ. ఈ రోజుల్లో తిరుపతి కొండల సీనరీ చూడనివాళ్ళ జన్మ ఏం జన్మ?" అన్నాను.

ప్రయాణానికి బ్రహ్మాండమైన కారు సంపాదించానని తెలిసిన మీదట ప్రకాశం కొడుకులు "పోదాం, మామయ్యా" అన్నారు.




"వెళ్ళి తీరాలిసిందే. అన్నయ్య గారూ" అన్నది ప్రకాశం భార్య.

ఎందుకైనా మంచిదని తొమ్మిది నాటికే మేమంతా తిరపతి చేరేటట్టుగా ఏర్పాటు చేశాను. కాటేజీ సులువుగానే దొరికింది.

అన్నప్రకారం పదోతేదీన కోటేశ్వరరావు లీలతోనూ, నలుగురు వితంతువులతోను కనిపించాడు. కొత్తగా స్వర్గానికి చేరిక పుణ్యాత్ముల బృందంలాగా వాళ్ళు ఒక కట్టగా దారిపక్క నిలబడి, చూడ దగినదీ, చూడదగనిదీ ఒకేరకమైన అసక్తితో చూస్తూ, ఎటువెళ్ళాలో నిర్ణయించలేని స్థితిలో ఉన్నట్టు కనబడ్డారు.

వాళ్ళ ప్రక్కన కారు ఆపి అందరమూ దిగాం. లీలతల్లినిచూసి "అమ్మా" అని కేకపెట్టి, వచ్చిమీద పడిపోయింది. వితంతువులు విస్తుపోయారు.

కోటీశ్వరరావు తల్లిని అందరమూ పోల్చగలిగాం. నేనావిడను సమీపించి, "మీరు మా లీల అత్తగారనుకుంటాను. ఇదుగో మీ వియ్యంకుడు, ఈవిడ మీ వియ్యపరాలు, వీళ్ళిద్దరూ లీల అన్నలు. వాడు తమ్ముడు. నేను వాళ్ళ క్షేమం కోరిన స్నేహితుణ్ణి. ఈకారు మద్రాసులో ఉండే మంత్రిగారిది, ఆ మంత్రి గారు మీ వియ్యంకుడి బాల్య స్నేహితుడు" అన్నాను. కారు మంత్రిగారిదన్నప్పుడు కోటీశ్వరరావుకు కన్ను మలిపాను. వితంతువులు అబద్ధం పోల్చలేరని నాకు తెలుసు.

వితంతువులు దిమ్మరపోయారు.

కోటీశ్వర్రావు చేదుమింగిన మొహం పెట్టాడు. అతనాడిన అబద్ధాలు బయట పడ్డాయి. నేనతన్ని చూసి జాలిపడలేదు. అతను లీలకు చేసిన అన్యాయంలో ఇది ఎన్నోవంతు?

వాళ్లను కూడా మా కాటేజీకి చేర్చాను. వాళ్లువింటుండగా ప్రకాశంతో మా "మిత్రు"లైన రాజాలను గురించీ, మహారాజులను గురించీ మాట్లాడాను. ప్రకాశం నాకేసి రోషంగా చూశాడు. కాని తన కూతురి మేలు కోరి కాబోలు నాకు అడ్డంరాలేదు.

ప్రకాశం భార్య వితంతువులతో ఎంతో అప్యాయంగా మాట్లాడింది. వాళ్లను తన యింటికొచ్చి పదిరోజు లుండమన్నది. వాళ్ల నోట ఇంచుమించు మాట లేదనే చెప్పవచ్చు. బాల వితంతువు మాత్రం, "మీ అమ్మాయి పెళ్ళికి మీరు రాకపోవటమేమిటి. అత్తయ్యగారూ! ఎప్పుడన్నా మీరు కూడా మా వూరు రావాలి." అన్నది.

లీలలోనే ఏదోమార్పు గమనించాను. తన వాళ్లను చూసిన మొదటి పావుగంటలో పాతలీలగానే కనబడింది. కాని క్రమంగా అసలు స్వరూపం వస్తున్నట్టు నాకనిపించింది. నాకూ, వాళ్లమ్మకు ఉత్తరాలు రాసిన లీల కాదీ లీల. కోటీశ్వరరావును ఒంటరిగా పట్టుకొని లీలలో మార్పు గురించి అడిగాను.

"మీరు బాగానే కనిపెట్టారు. లీల మారుతున్నది. ఇంకా మారుతుంది."

అతను చెప్పినదాన్ని బట్టి నేను గ్రహించిన దేమంటే కానూరు అగ్రహారం వాళ్ళు మొదట్లో లీలనొక వింత మృగంలాగా చూసినా, అది తమకన్న ఎక్కువ సంస్కారం గలదనేది తమకే తెలియకుండా గుర్తించి, గౌరవించ సాగారు. నిజానికి వాళ్ళు మొదట్లో నిరసించినది లీలలో కనిపించిన నాగరిక సంస్కారాల చిహ్నాలే. నాగరిక సంస్కారాల చిహ్నాలను ద్వేషించటం తేలికేగాని, నాగరికతనూ, సంస్కారాన్ని తృణీకరించటం తేలిక కాదు. ఈ సంగతి మనచరిత్ర రుజువుచేస్తూనే ఉందనుకుంటాను.

లీల తమకు సహజ శత్రువుకాదని తెలిసి వచ్చినకొద్దీ అత్తవారింటివాళ్ళూ, వాళ్ళ వెనకనే ఊళ్ళోవాళ్ళూ, దానికి సన్నిహితులై, దానిలో కొత్తకొత్త గుణాలు కనిపెట్ట సాగారు. పుట్టిననాటి నుంచీ మా కెవరికీ దానిలో కనిపించని గొప్పగుణాలు వాళ్ళకు లీలలో కనిపించి ఉంటాయనటానికి సందేహం లేదు. తన చుట్టూ ఉండేవాళ్ళ గౌరవం_అందులోను తనను అగౌరవంగా చూసే హక్కున్న వాళ్ళనుంచి_ పొందటంలో లీలకు ఏదో ఆనందం కనిపించిం దన్నాడు కోటీశ్వర్రావు. నిజంఅయి ఉండవచ్చు.

రెండు రోజులు కొండమీద ఉండి లీలావాళ్లు బయలుదేరేటప్పుడే మేమూ బయలుదేరాం. వాళ్ళు మాతో బాటు పట్నం రావటానికి లేదు మా కారులో చోటులేదు. వితంతువులకు ఈ మహాలోకంనుంచి ఎప్పుడు తమ సొంత రాజ్యంలో పడదామా అని ఉన్నది. ఒక మాసంలోపల లీలా తనూ కలిసి పట్నంవస్తామని కోటీశ్వర్రావు మాట ఇచ్చాడు.

కనీసం లీలనైనా మావెంట పంపమని అతన్ని అడిగాం. కోటీశ్వర్రావుకు అభ్యంతరం లేదు. ని లీకే, "ఇప్పుడు కాదులే. ఇది పనుల తరుణం" అన్నది.

వితంతువుల మొహాలలో కలిగిన వికాసం చూసి తీరాలి.

లీలా, దాని మొగుడూ మరి రెండు నెలలు పోయాక పట్నం వచ్చారు. ఈ సారి లీలలో మార్పు మరింతస్ఫుటంగా కనబడింది. అదంతా గర్భిణీ లక్షణమనటానికి వీల్లేదు. పెళ్లి కాక పూర్వం జీవించినట్టుగా అదిజీవించి ఉండవచ్చు. అభ్యంతరంచెప్పే వారెవరూలేరు. కాని అప్పటి పద్ధతులన్నిటినీ అది మార్చుకున్నది.

తల్లి సహజంగా తనకూతురు అత్తవారింట పడుతున్న కష్టాలను గురించి వివరించగా తెలుసుకుందామని ప్రయత్నించింది, లీల మొదట్లో రాసిన విషయాలన్నీ తవ్వింది. కాని ఆ విషయాలు తల్లితో సైతం చెప్పటానికి ఆసక్తి ఉన్నట్టు కనపడలేదు; ఎంతసేపూ తమ గ్రామంలో ఒక్కొక్క కుటుంబం గురించీ ఎవరికీ అక్కర్లేని వివరాలు చెప్పింది. అదంతా ఇప్పుడు లీల జీవితం; అందులో లీల తల్లికిగాని, మిగిలిన వాళ్లకుగాని కాస్తయినా ఆసక్తి లేదు.

లీలకు సూడిదలు చేశారు. లీల నెరిగిన వాళ్ళూ, స్నేహితురాళ్ళూ చాలామంది వచ్చారు. వాళ్ళతో ఆప్యాయంగా మాట్లాడటానికి లీల చాలా ప్రయాసపడింది. "మొరటు తేలేవు," అన్నారు కొందరు. లీల పల్లెటూరు చేరినందుకు కొందరు సానుభూతి కూడా చూపయత్నించారు. లీల మొహం మాడ్చుకున్నది.

వాళ్ళిద్దరూ గట్టిగా పదిహేను రోజులు కూడా ఉండలేదు. ఇంకా రెండుమూడు రోజులకు బయల్దేరుతారనగా లీల ప్రయాణం గురించే ప్రధానంగా మాట్లాడింది అది తన మొగుడి చేత ఏవో యాంటిసెప్టిక్ ఆయింట్‌మెంట్లూ, కళ్ళకలక ఆయింట్‌మెంట్లూ, టించర్ బెంజాయిన్, ప్లాస్టర్లూ, దూదీ ఇత్యాదులుకొనిపించింది. ఊళ్ళోవాళ్ళకు



చిన్న చిన్న చికిత్సలూ, ప్రథమ చికిత్సలూ చెయ్యటానికట. అది పెళ్ళి కాక పూర్వం తనసంగతి తప్ప ఇంకెవరి సంగతీ చూసుకునేది కాదు. ఇదీ కాస్త నయమేనని అనుకున్నాను. కాని వెధవమనసు — ఇదీ తన స్వవిషయం చూసుకోవట మేనేమో నన్న అనుమానం వచ్చి, ఆ కాస్త సద్భావమూ మలినమైపోయింది.

* * *

అదీ లీల కథ. ఇటీవలనే నేను వాళ్ళ వూరు వెళ్ళాను. లీల ఇప్పుడు ముగ్గురు పిల్లల తల్లి. అత్తగారు పక్షవాతంతో మంచాన పడి తీసుకుంటున్నది. ఆడబిడ్డ వితంతువులు లీల అడుగులకు మడుగు లొత్తుతారు. ఊళ్ళో ఆడవాళ్ళు చాలాభాగం లీలకు భక్తురాళ్ళు. మగవాళ్ళలో తిరుగుబాటు భావాలు తల ఎత్తుతున్నాయి. నాట్లప్పుడూ, కోతలప్పుడూ కూలీలు చాలా పేచీలు పెడుతున్నారు.

వాళ్ళ భాషా, భావాలు చూచి లీల చాలా అసహ్యపడుతుంది. ఒకసారి తిండికిలేని వెధవలకే ఇంతధీమాఉంటే పైమెట్టుమీద ఉన్నవాళ్ళ కింకెంత ఉండాలి?" అంటుంది. మరుక్షణమే,

---

★ ఒక ఆసామి రెండోఆట సినిమా నుంచి తిరిగి వస్తున్నాడు. సందులో చీకటిగా వుంది. ఉన్నట్టుండి ఇద్దరు మనుషులు ఆసామీని ఆపుజేశారు. "అయ్యా! దయచేసి మీ దగ్గిరొక పైసావుంటే ఇస్తారా?" అని అడిగారు.

ఆసామీ ముందు కంగారుపడి, మళ్ళీ తమాయించుకుని "ఇస్తాను గాని, ఏం చేస్తారు దాంతో?" అన్నాడు.

"మరేం లేదండి. మాలోమాకు తగాదా వచ్చింది. ఏ దెవరు తీసుకోవాలని. పైసా ఎగరేస్తాము. బొమ్మ పడితే మీ గడియారం వాడిది, ఉంగరం నాది. బొరుసుపడితే ఉంగరం వాడిది, గడియారంనాది. మీ డబ్బు సరే, ఇద్దరం సమానంగా పంచుకుంటా మనుకోండి" అన్నాడు వారిలో ఒకడు.



"ఈ వెధవలకు తిన్నది సరిగా హరాయింపు కావటం లేదు. ఒక్క డొక్కమాడిస్తేగాని చెప్పినట్టు వినరు" అంటుంది.

చిక్కేమిటంటే కూలిజనానికి లీల వంటివాళ్ళ జీవితం గురించి తెలిసినట్టుగా లీలవంటివాళ్ళకు కూలీలను గురించి తెలీదు. తెలీదనికూడా తెలీదు. కర్మ. లీలకు తెలిసిందల్లా, ప్రభుత్వమూ, పోలీసులూ తన పక్షమే ఉంటారని.

వాళ్ళ ఊళ్ళో కూలిజనాన్ని కూడగట్టే నరసయ్య అనేవాణ్ణి రౌడీలు చావచితక గొట్టారు. ఆపని జరుగుతుందని లీలకు ముందే తెలుసు. రౌడీల ప్రతినిధికి కోటేశ్వర్రావు డబ్బిచ్చేటప్పుడు లీల అక్కడే ఉన్నదని వాళ్ళ ఊళ్లో చెప్పుకుంటారు.

అయితేనేం? లీల చాలా పుణ్యం సంపాదించుకుంటున్నది. కార్తీక స్నానాలు చేస్తుంది, ఏకాదశి ఉపోషా లుంటుంది. బ్రాహ్మలకు సంతర్పణలు చేస్తుంది. ఏడాదికి రెండు సార్లు సత్యనారాయణవ్రతం చేస్తుంది. లీలజీవితం పూర్తిగా మారిపోయింది,

(సమాప్తం)